
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శుక్రవారం 15 ఆగస్టు 2025 | 7

వందేమాతరం!

మదిమదిలో జాతీయత ఉప్పొంగింది. జై భారత్ నినాదాలతో ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల ర్యాలీ హోరెత్తింది. 57 అడుగుల భారీ జాతీయ జెండా చేతపట్టుకుని వై.జంక్షన్, నందం గనిరాజు సెంటర్, కంబాలచెరువు మీదుగా తిరిగి కళాశాల వరకూ ర్యాలీ కొనసాగింది. విద్యార్థులతో పాటు ప్రిన్సిపాల్ రామచంద్రరావు, యూత్ రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ జి.రవితేజ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సుభాషిణిదేవి, మురళీకృష్ణ, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ అనూష పాల్గొన్నారు.



ఆర్టీ షీ ఉచితం!



ఈ బస్సుల్లోనే ఉచిత ప్రయాణం..

జిల్లాలో రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, గోకవరం నాలుగు డిపోల పరిధిలో అన్ని రకాల బస్సులు కలిపి ఆర్టీసీకి మొత్తం 205 సొంత బస్సులు, 78 అద్దె బస్సులు ఉన్నాయి. వీటిలో ఆర్టీసీ, అద్దె బస్సులు కలిపి... 37 ఎక్స్‌ప్రెస్‌లు, 27 అల్ట్రా పల్లెవెలుగు, 167 పల్లెవెలుగు ఉండగా, స్త్రీ శక్తి పథకంలో ఈ బస్సుల్లోనే బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా రాకపోకలు సాగించవచ్చు. డిపోల వారీగా చూస్తే రాజమహేంద్రవరం డిపోలో 22 ఎక్స్‌ప్రెస్‌లు, 15 ఆల్ట్రా పల్లెవెలుగు, 64 పల్లెవెలుగు బస్సులు ఉన్నాయి. గోకవరం డిపోలో 14 ఎక్స్‌ప్రెస్‌లు, 12 ఆల్ట్రా పల్లెవెలుగు, 30 పల్లెవెలుగు బస్సులు ఉన్నాయి. కొవ్వూరు డిపోలో ఒక ఎక్స్‌ప్రెస్ మాత్రమే ఉంది. 42 పల్లెవెలుగు బస్సులు ఉన్నాయి. నిడదవోలు డిపోలో కేవలం 31 పల్లెవెలుగు బస్సులు ఉన్నాయి.

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ శుక్రవారం నుంచి స్త్రీ శక్తి పథకం అమలుకు సిద్ధమవుతోంది. స్త్రీలకు పంద్రాగస్టు కానుకగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రారంభిస్తోంది. ఇక బాలికలు,స్త్రీలు, ట్రాన్స్‌జెండర్లు జీరో ఫేర్ టిక్కెట్‌తో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా వెళ్లి రావచ్చు.తూర్పుగోదావరి జిల్లాలో పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఈ ఉచిత ప్రయాణ పథకం అందుబాటులోకి వస్తుంది. నాన్‌స్టాప్ సర్వీసులు, అంతర్రాష్ట్ర సర్వీసులకు ఉచిత ప్రయాణ పథకం వర్తించదని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొనడంతో రాజమహేంద్రవరం-కాకినాడ నాన్‌స్టాప్ సర్వీసులు, భద్రాచలం అంతర్‌రాష్ట్ర బస్సుల్లో మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత ప్రయాణం అనుమతించరు. అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, స్టార్ లైనర్, సప్తగిరి,ఏసీ బస్సులతో పాటు పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిపే స్పెషల్ సర్వీసుల్లోనూ ఉచిత ప్రయాణం వర్తించదు.

జీరో టిక్కెట్..



స్త్రీలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు జీరో ఫేర్ టిక్కెట్ జారీ చేస్తారు. స్త్రీ శక్తి టిక్కెట్లపై తాము ప్రయాణించే దూరానికి టిక్కెట్ చార్జీ ఎంతవుతుందో ఆ మొత్తం ముద్రించి ఉంటుంది. దానికింద ప్రభుత్వ రాయితీ అంతే మొత్తాన్ని పేర్కొంటారు. చివరన టిక్కెట్ ఛార్జీ జీరోగా చూపిస్తారు.దీనివల్ల ప్రభుత్వం నుంచి తాము ఎంత లబ్ధిపొందాం అనేది మహిళలు తెలుసుకుంటారని ప్రభుత్వం భావిస్తోంది. స్త్రీ శక్తి పథకం అమలులో గందరగోళానికి తావులేకుండా టిక్కెట్లు జారీ చేసే మెషీన్ (టిమ్స్)లో ప్రత్యేకంగా ఉమెన్ ఫ్రీ టిక్కెట్ (డబ్ల్యుఎఫ్‌టీ) పేరిట ప్రత్యేకంగా ఒక బటన్ ఏర్పాటు చేశారు. బాలికలు, స్త్రీలు, ట్రాన్స్‌జెండర్లకు జీరో ఫేర్ టిక్కెట్ ఇవ్వడానికి ఈ ఒక్క బటన్ ప్రెస్ చేస్తే చాలు ప్రింటెడ్ టిక్కెట్ వస్తుంది. పురుషులకు గతంలో మాదిరిగానే ప్రయాణ దూరానికి అనుగుణంగా ఛార్జీలను నిర్దేశించి టిక్కెట్లు ఇస్తారు.

నేటి సాయంత్రం 5 గంటల నుంచి..

శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి స్త్రీ శక్తి పథకం అమల్లోకి వస్తుంది.సీఎం చంద్రబాబు రాష్ట్రస్థాయిలో ఈ పథకాన్ని ప్రారంభించే సమయంలోనే జిల్లాలోనూ మంత్రులు, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు జిల్లాలోని నాలుగు డిపోల్లో స్త్రీ శక్తి పథకం ప్రారంభిస్తారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సాయంత్రం జరిగే కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభిస్తారు.ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. గోకవరం,కొవ్వూరు, నిడదవోలు డిపోల్లో ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు ప్రారంభిస్తారు.

- నేటి నుంచి స్త్రీశక్తి పథకం అమలు
- ఇక బస్సెక్కితే మహిళలకు ఫ్రీ
- గుర్తింపుకార్డు చూపించాలి
- సర్కారు ఆగస్టు 15 కానుక
- జిల్లావ్యాప్తంగా 283 బస్‌లు
- టిమ్స్‌లో ప్రత్యేక బటన్ ఏర్పాటు
- నాన్‌స్టాప్, ఇంటర్ స్టేట్‌లకు నో

స్త్రీ శక్తి అమలుకు సిద్ధంగా ఉన్నాం..



స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి అమల్లోకి వస్తుంది.జిల్లాలో స్త్రీ శక్తి పథకం అమలుకు సిద్ధంగా ఉన్నాం. టిక్కెట్ తీసుకునే సమయంలో ఆర్టీసీ సిబ్బందికి తగిన గుర్తింపుకార్డు చూపించి జీరో టిక్కెట్ పొందాలి. టిక్కెట్ల జారీకి సంబంధించి ఎలాంటి గందరగోళానికి తావులేకుండా ఆర్టీసీ సిబ్బందికి ఇప్పటికే తగిన శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించాం.
వైఎస్ఎన్ మూర్తి, జిల్లా ప్రజారవాణా అధికారి

జెండా పండుగకు సర్వం సిద్ధం

నేడు ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహణ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో శుక్రవారం నిర్వహించే 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశామని జేసీ ఎస్.చిన్నరాముడు వెల్లడించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో వేడుకల ఏర్పాట్లను ఇతర శాఖల అధికారులతో కలిసి గురువారం జేసీ చిన్నరాముడు పరిశీలించి తగు సూచనలు చేశారు. అధిక వర్షం పడితే సుబ్రహ్మణ్య మైదానం వద్ద నిర్వహించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 14 శాఖలకు చెందిన శకటాలు, స్టాల్స్, ప్రదర్శన, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఆయన వెంట ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, ఆర్ఎంసీ ఏడీసీ వీవీ రామలింగేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి ఉన్నారు.





రాజమహేంద్రవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవానికి ముందస్తు కసరత్తులో భాగంగా ఎస్పీ నరసింహ కిషోర్ రిహార్సల్స్ నిర్వహించారు. జాతీయ పతాకావిష్కణ అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. సాయుధ పోలీస్ బలగాల పరేడ్ తిలకించారు.



విద్యుత్ కాంతుల్లో కార్పొరేషన్ కార్యాలయం



ఫ్రీ..రంగదే!

స్వాతంత్ర్య దినోత్సవ వేళ మూడు మార్పులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో నేటి నుంచి మూడు రకాల కీలక నిర్ణయాలు అమల్లోకి రానున్నాయి. వీటి ద్వారా ఇకపై పలు వర్గాలకు స్వేచ్ఛ లభించనుంది. ముఖ్యంగా మహిళలు,యువతులు, హైవేలపై ప్రయాణించే వాహనదారులు, అన్నదాతలు లబ్ధిపొందనున్నారు. నేటి నుంచి అమల్లోకి రానున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,హైవే టోల్‌గేట్ల దోపిడీ నుంచి బయటపడేలా కొత్త ఫాస్టాగ్ వార్షిక పాస్, కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీయే. ఈ మూడు కీలక నిర్ణయాల అమలుతో ఆయా వర్గాల్లో ఆనందం వెల్లువిరుస్తోంది.

నేటి నుంచి ఫ్రీ..

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేటి సాయంత్రం నుంచి అందుబాటులోకి రానుంది. పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా బాలికలు, మహిళలు,ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా ప్రయాణించే సౌలభ్యం అందుబాటులోకి రానుంది. కేవలం ఆధార్‌కార్డు చూపించి రాష్ట్రమంతటా ఉచితంగా ప్రయాణించొచ్చు. ఈ మేరకు ఈపథకాన్ని సీఎం చంద్రబాబు నేటి సాయంత్రం ప్రారంభించనున్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో అడ్డగోలుగా ఆర్టీసీ ఛార్జీలను పెంచేసి పేదల నడ్డి విరగ్గొట్టింది. ఈ నేపథ్యంలో ఎన్నికలకు ముందు టీడీపీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రకటించి నేటి నుంచి అమలు చేస్తోంది.ఉమ్మడి జిల్లాలో దాదాపు 38 లక్షల మందికిపైగా మహిళలు లబ్ధిపొందనున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 11 ఆర్టీసీ డిపోల పరిధిలో 532 పల్లెవెలుగు, ఆల్ట్రాపల్లె వెలుగు బస్సులు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు 191, కోనసీమలో 176 పల్లెవెలుగు, తూర్పుగోదావరిలో పల్లెవెలుగు,ఆల్ట్రాపల్లె వెలుగు,ఇతర బస్సులు 283 ఉన్నాయి.ఎక్స్‌ప్రెస్ బస్సులు వంద వరకు ఉన్నాయి. వీటన్నింటిలోను మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుకానుంది.

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- బాలికలు,మహిళలు,ట్రాన్స్‌జెండర్లకు ఆధార్‌తో ఫ్రీ
- హైవే ప్రయాణానికి ఫాస్టాగ్ వార్షిక పాస్
- రూ.3 వేలు చెల్లిస్తే 200 సార్లు ఛాన్స్
- రాజ్‌మార్గ్‌యాత్ర యాప్ ద్వారా పాస్‌లు
- రైతులకు కొత్త పాస్‌బుక్‌లు నేటి నుంచే

హైవేపై హాయిగా...

కేంద్రప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన వార్షిక ఫాస్టాగ్ పాస్ అమల్లోకి రానుంది. తద్వారా కేవలం రూ.3 వేల ఫాస్టాగ్ తీసుకుని దేశంలో ఏ హైవేపై ఉన్న టోల్‌ప్లాజా ద్వారా ఫ్రీగా ప్రయాణించవచ్చు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం గురువారం అర్ధరాత్రి 12 గంటల నుంచి అమల్లోకి వచ్చింది.ఈ పాస్ ద్వారా ప్రయాణించే వెసులుబాటు కార్లు, వ్యాన్‌లు, జీపులు ఇతర వ్యక్తిగత అవసరాలకు వినియోగించే వాటికే వర్తిస్తుంది. ఈ విధానం వల్ల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వాహనదారులకు భారీగా ప్రయోజనం కలిగించనుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఐదు టోల్‌ప్లాజాలు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉన్నాయి.ఆయా టోల్‌గేట్లు వద్ద నిర్ణీత రుసుంను ఫాస్టాగ్ ద్వారా చెల్లించాలి. వీటితో పాటు తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న కొవ్వూరు వద్ద మరో టోల్ ప్లాజా ఉంది. ఇది రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన ఏపీఆర్‌డీసీ ఆధీనంలో ఉంది. ప్రస్తుతం ఈ టోల్‌ప్లాజాల ద్వారా వెళ్లే ప్రతి వాహనానికి టోల్‌ఫీని వాహనానికి ఉన్న ఫాస్టాగ్ ద్వారా చెల్లించాలి. ఒక వేళ ఫాస్టాగ్ సొమ్ములు లేకున్నా..ఫాస్టాగ్ లేకున్నా నిర్ణీత రుసుము కంటే 100 శాతం అదనంగా చెల్లించాలి. కొత్త విధానంలో ఫాస్టాగ్ రీచార్జి తరచూ చేసుకునే ఇబ్బంది లేకుండా ఏడాది రుసుం చెల్లించే విధంగా కేంద్రం కొత్త నిర్ణయం తీసుకొచ్చింది. ఈ ఫాస్టాగ్ యాన్యువల్ పాస్‌కు ఏడాదికి రూ.3 వేలు చెల్లించాలి.ఇలా రీచార్జి చేయించిన వాహనం దేశవ్యాప్తంగా ఏ టోల్‌ప్లాజా ద్వారానైనా 200 సార్లు ప్రయాణించే అవకాశం ఉంది. ఏడాది లేదా 200 సార్లు ఏది ముందైతే దానిని పరిగణనలోకి తీసుకుంటారు.వాణిజ్య అవసరాలకు తిరిగే వాహనాలకు అవకాశం ఉండదు.రాష్ట్ర రహదారులు, ఇతర ప్రాంతాల్లో టోల్‌గేట్ల వద్ద సాధారణ పద్ధతి లో ఫాస్టాగ్ ద్వారా టోల్ ఫీ చెల్లించాలి.తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు వద్ద సాధారణ ఫాస్టాగ్ ద్వారానే టోల్‌ఫీ చెల్లించాలి. ఫాస్టాగ్ యాన్యువల్ పాస్ రాజ్‌మార్గ్ యాత్ర యాప్ లేదా ఎన్‌హెచ్‌ఏఐ అధికారిక వెబ్‌సైట్ నుంచి పొందవచ్చు.

టోల్ ఫీజు 15 రూపాయలే..

ఏడాది లేదా 200 సార్లు తిరిగేందుకు వీలుగా ఫాస్టాగ్ తీసుకోవడం వల్ల వాహనదారులకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది. దీనివల్ల ఒక ట్రిప్పునకు రూ.15 మాత్రమే పడుతుంది. గొల్లప్రోలు టోల్‌ప్లాజా ద్వారా కారు, జీపు, వేన్‌లకు ఒకవైపు రూ.50 రుసుం ఉంది. దీని ప్రకారం 200 సార్లు ఇవి తిరిగితే పాత పద్ధతిలో రూ.10 వేలు అవుతుంది. కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద 200 ట్రిప్పులకు రూ.22 వేలు, ఈతకోట వద్ద టోల్ ప్లాజా వద్ద రూ.25వేలు అవుతుంది. రాష్ట్రంలోని ఇతర టోల్‌ప్లాజాల వద్ద ఇంతకంటే అధిక రుసుములు వసూలు చేస్తున్నారు. నూతన విధానంలో ఒక్కొక్కచోట రూ.15 మాత్రమే కట్ అవుతుంది. దాంతో 200 సార్లకు రూ.3 వేలు చెల్లిస్తే సరిపోతుంది. బ్యాలెన్స్ అయిపోతే మళ్లీ రీచార్జి చేసుకుంటే అదే ప్యాకేజీ వర్తిస్తుంది.

రైతులు పాస్..పాస్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి రైతులకు ప్రభుత్వం కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేయనుంది. భూసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు కొత్త పాస్ పుస్తకాలను అధికారులు అందించబోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అసలు పాస్‌పుస్తకాల జారీయే పెద్దగా జరగలేదు. అప్పటి సీఎం జగన్ అస్తవ్యస్త విధానాలతో చేపట్టిన భూసర్వే పేరుతో మరింత తలనొప్పి పెరిగింది.ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మునుపటిలా ఆంధ్రప్రదేశ్ రాజముద్రతో కొత్త పాస్ పుస్తకాల జారీకి రెవెన్యూశాఖ నిర్ణయించింది. ఎట్టకేలకు ఇవన్నీ ప్రింటింగ్ పూర్తి చేసుకుని జిల్లాలకు చేరుకున్నాయి. గత వైసీపీ హయాంలో కాకినాడ జిల్లా 15 మం డలాల పరిధిలో 269 గ్రామాలు, తూర్పుగోదావరి జిల్లా 19 మండలాల్లో 190 గ్రామాలు, కోనసీమ జిల్లాలో 150 కిపైగా గ్రామాల్లో సర్వే చేశారు. నేటి నుంచి రీసర్వే పూర్తిచేసుకున్న గ్రామాల్లో పం పిణీ చేయనున్నారు.కాకినాడ జిల్లాలో 1.47 ల క్షలు, కోనసీమ జిల్లాలో 1.02 లక్షలు,తూర్పుగోదావరి జిల్లాలో 95 వేల వరకు పాస్ బుక్‌లు ఇవ్వనున్నారు.ఇకపై స్వేచ్ఛగా రైతులు భూముల క్రయవిక్రయాలు,బ్యాంకు రుణాలు తెచ్చుకోవచ్చు.



తాళ్లపూడిలో నీట మునిగిన పాఠశాల

ముంచిన వాన



రాజమహేంద్రవరంలో నీట మునిగిన రోడ్డుపై ఇలా..

రాజమహేంద్రవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి) : వాతావరణం మారింది.. నిన్నటి వరకూ ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు.. అయితే బుధవారం మధ్యాహ్నం నుంచి వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందుతున్నారు. చల్లదనాన్ని ఆస్వాదిస్తున్నారు.గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం చల్లగానే ఉంది. బుధవారం పలు ప్రాంతాల్లో మొత్తం 957 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా సరాసరి వర్షపాతం 50.4 మిల్లీ మీటర్లు. ఉండ్రాజవరం మండలంలో ఉదయం 8.30 గంటల వరకూ ఏకంగా 180.6 మిల్లీమీటర్లు, పెరవలిలో 170.6, నల్లజర్లలో 120 మిల్లీ మీటర్లు అత్యధిక వర్షపాతం నమోదైంది. గోపాలపురం మండలంలో 8.2 మిల్లీమీటర్ల అతి తక్కువ వర్షపాతం నమోదైంది. కొద్దిపాటి వర్షానికి పల్లపుప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ పి.ప్రశాంతి జిల్లా యం త్రాంగాన్ని అప్రమత్తం చేశారు. పల్లపు ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని..ముంపు ముప్పు ఉన్న పాఠశాలలకు సెలవుపై నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆమె జేసీ ఎస్. చిన్నరాముడు, డీఆర్వో టి.సీతారామమూర్తి, ఇతర అధికారులతో కలసి క్షేత్రస్థాయి అధికారులకు దిశానిర్దేశం చేశారు. గోదావరి పరీవాహక ప్రాంతాలు, కాలువలు, చెరువుల వద్ద ముందస్తుగా హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు. ఏటిగట్లు పటిష్ఠతపై తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.నష్టాలు అంచనా వేసి కచ్చితమైన గణాంకా లతో 24 గంటల్లోపు నివేదికలు అందజేయాలని ఆదే శించారు.ఇప్పటికే జిల్లా,డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రెండు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షం ఖరీఫ్ సీజన్‌కు మేలు చేస్తుందని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు తెలిపారు. ప్రస్తుతం వరినాట్లు మునిగినా త్వరగానే తేలిపోతాయన్నారు. ఇంకా మరింత ఎక్కువగా మరిన్ని రోజులు వర్షం పడితే కాస్త ఇబ్బంది అవుతుందని, దానికి అనుగుణం రైతులు చర్యలు చేపట్టాలన్నారు.

తాళ్లపూడిలో దంచికొట్టింది!

తాళ్లపూడి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మం డలంలోని పలు గ్రామాల రహదారులు వర్షపు నీటికి గురువారం నీట మునిగాయి. మండలంలోని వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ వర్షం నీటితో చెరువులా తయారైంది. నీరు బయటకు పోయే దారిలేక ఆ ప్రాంగణం మొత్తం నీటితో నిండిపోయింది. తాళ్లపూడి మెయిన్ రోడ్డులో డ్రైనేజీ వ్యవస్థ లేక కురిసిన వర్షంనీరు రోడ్డుమీదే నిలిచి పో తోంది.దీంతో గ్రామస్తులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు.



నీట మునిగిన తాళ్లపూడి మెయిన్‌రోడ్

హోటల్ నిర్మిస్తే భూమిస్తాం : కలెక్టర్

రాజమహేంద్రవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి) : రానున్న గోదావరి పుష్కరాల సందర్భంగా రాజమహేంద్రవరంలో హోటల్ నిర్మాణం చేపట్టేవారికి నామమాత్రపు ధరలకే భూములు కేటాయిస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఆమె జిల్లాలోని హోటల్ యజమానుల అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. పుష్కరాలకు రోజుకు లక్ష మందికి వసతి కల్పించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. చిన్నహోటళ్లు, కాంప్లెక్స్‌లు నిర్మించదలచిన వారికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. శాశ్వతలేదా తాత్కాలిక గదులు నిర్మించడానికి ప్రతిపాదనలు సమర్పిస్తే వాటిని పరిశీలించి ముందుకు తీసు కెళతామన్నారు.

ఇస్కాన్‌ంతులు



రాజమహేంద్రవరంలో ఇస్కాన్ టెంపుల్ చూడడానికి రెండు కళ్లూ చాలవు.. విద్యుత్ కాంతులతో నిండిపోయింది.. కృష్ణాష్టమి శనివారం సందర్భంగా ఆలయ ఆవరణ అంతా ప్రత్యేక విద్యుద్దీపకాంతులు ఏర్పాటు చేశారు.. గురువారం రాత్రి నుంచే ఆలయం ఇలా కళకళలాడింది.. పెద్ద ఎత్తున భక్తుల హాజరై తిలకించారు.

తల్లిదండ్రుల కలలు సాకారం చేయండి : ఎస్పీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల కలలను సాకారం చేయడానికి ప్రతి విద్యార్థి కృషి చేయాలన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించిన 57 మంది పోలీసు పిల్లలకు ప్రోత్సాహక బహుమతులను ఎస్పీ నరసింహ కిషోర్ గురువారం అందజేశారు. ఉన్నత లక్ష్యాలు పెట్టుకుని వాటిని సాధించి సమాజంలో విజయ వంతమైన వ్యక్తులుగా ఎదగాలన్నారు. పిల్లలు చదువుతోపాటు వివిధ రంగాల్లో రాణించే విధంగా ప్రోత్సహించాలన్నారు. పోలీసులు, వారి కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తనను నేరుగా సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, చెంచి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యోద్యమంలో వారంతా రా'రాజులు'



కాశిన వెంకటరత్నం భూపతిరాజు జగ్గరాజు నడింపల్లి బంగార్రాజు నడింపల్లి జగ్గరాజు నడింపల్లి రామచంద్రరాజు నడింపల్లి సుబ్బరాజు

(ఆంధ్రజ్యోతి - అమలాపురం రూరల్)

భరతమాత దాస్యశృంఖలాలను తెంచేందుకు ఆనాడు ఎందరో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునే సమయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలంలోని జంట గ్రామాలుగా గుర్తింపు పొందిన వన్నెచింతలపూడి, రంగాపురం గ్రామాలే గుర్తుకు వస్తాయి. ఆ రెండు గ్రామాల నుంచి 17 మంది స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపినవారే. వారికి అండగా ఎప్పుడూ వందమందికి పైగా అనుచరులు ఉన్నారు. స్వాతంత్ర్యోద్యమ పురిటిగడ్డలు ఆ గ్రామాలు అయితే.. ఉద్యమాన్ని ముందుండి నడిపించింది అందరు రారాజులే. వన్నెచింతలపూడి గ్రామం నుంచి నడింపల్లి కుటుంబీకులే స్వాతంత్ర్యోద్యమాన్ని నడిపించారు. ఒకే కుటుంబానికి చెందిన నడింపల్లి జగ్గరాజు, భీమరాజు, వెంకటపతిరాజు, రామభద్రరాజు సోదరులు స్వాతంత్ర్యోద్యమంలో కీలకంగా పాల్గొన్నారు. ఒకే కుటుంబం నుంచి నలుగురు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ఘనత ఆ కుటుంబానికే దక్కుతుంది. ఈ గ్రామం నుంచి నడింపల్లి బంగార్రాజు ఆధ్వర్యంలో నడింపల్లి సీతారామరాజు, నడింపల్లి భీమరాజు, నడింపల్లి జగ్గరాజు, నడింపల్లి వెంకటపతి రాజు, నడింపల్లి విశ్వనాధరాజు, నడింపల్లి సుబ్బరాజు(సాధురాజు), నడింపల్లి రామమూర్తి రాజు, నడింపల్లి సత్యనారాయణరాజులతోపాటు భూపతిరాజు సుబ్బరాజులు స్వాతంత్ర్యోద్యమంలో జైలు జీవితం గడిపినవారే. అదేవిధంగా రంగాపురం గ్రామానికి చెందిన భూపతిరాజు జగ్గరాజు ఆధ్వర్యంలో భూపతిరాజు సూర్యనారాయణ రాజు, భూపతిరాజు రామరాజు, భూపతిరాజు రామచంద్రరాజు, భూపతిరాజు వెంకటపతిరాజులతోపాటు నడింపల్లి సత్యనారాయణ రాజు, నడింపల్లి సుబ్బరాజులు దేశంలోని వివిధ ప్రాంతాల్లో జైలు జీవితాలు గడిపినవారే. తమ యావదాస్తులను ఉద్యమానికి అర్పించిన వారే.

జగ్గరాజు ఖైదీ నంబరు 5282

వన్నెచింతలపూడి గ్రామానికి చెందిన నడింపల్లి జగ్గరాజు ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు 1930జూలై 8న బ్రిటీష్ పోలీసులు అరెస్టు చేశారు. ఆరు నెలలు జైలు శిక్ష విధించగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఖైదీ నంబరు 5282 కింద ఉన్నారు. శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నందుకు 1932 జనవరి 18న మరోసారి ఆయన అరెస్టు అయ్యారు. ఆయనకు ఆరు నెలలు జైలుశిక్ష, రూ.500 జరిమానా విధించారు. జరిమానా కట్టని పక్షంలో అదనంగా నెల 15 రోజులు జైలుశిక్ష అనుభవించాలని కోర్టు తీర్పు ఇవ్వడంతో బళ్లారిలోని సెంట్రల్ జైలుకు తరలించారు. అప్పట్లో గ్రామంలోని ఐదు ఎకరాల భూమిని విక్రయించి రూ.500 జరిమానా చెల్లించడంతో ఆరు నెలల జైలు శిక్ష అనంతరం విడుదలయ్యారు. బళ్లారిలోని సెంట్రల్ జైలులో జగ్గరాజుతోపాటు నీలం సంజీవరెడ్డి కూడా జైలు శిక్ష అనుభవించారు. వారిద్దరూ జైలుమేట్స్. అనంతర కాలంలో సంజీవరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో జగ్గరాజును గుర్తు పెట్టుకుని మరీ ఆయన యోగక్షేమాలను సంజీవరెడ్డి అడిగేవారు.

సైకిల్‌పై తిరుగుతూ...

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో సైకిల్‌పై తిరుగుతూ ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్న ఘనత నడింపల్లి బంగార్రాజుకు దక్కుతుంది. స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా 1930 దశకంలోనే మద్రాసు, రాజమహేంద్రవరం, బళ్లారి సెంట్రల్ జైళ్లలో ఎన్నో నెలలపాటు జైలు శిక్ష అనుభవించారు. మహాత్మాగాంధీ స్ఫూర్తితో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత బంగార్రాజుతోపాటు పలువురికి కేంద్ర ప్రభుత్వం తామ్రపత్రాలు అందించారు. బంగార్రాజుకు పెన్షన్‌తో పాటు ప్రభుత్వం భూమిని అప్పగించింది. అయితే వాటిని ఆయన తృణప్రాయంగా త్యజించారు. బంగార్రాజుకు కేటాయించిన భూమిని భూదాన ఉద్యమంలో వినోబాబావేకు అప్పగించారు.

ఉత్తరాలపై నిఘా..

స్వాతంత్ర్యోద్యమంలో ఉద్యమవీరులపైనే కాకుండా తపాలాశాఖ ద్వారా బట్వాడా అయ్యే ఉత్తరాలపై కూడా నిఘా పెట్టారు. అప్పట్లో భూపతిరాజు జగ్గరాజు ఉద్యమంలో భాగంగా కొరియర్‌గా పనిచేశారు. పోస్టుకార్డుల ద్వారానే ఉద్యమ సమాచారాన్ని రహస్యంగా పంపిస్తున్నారన్న విషయాన్ని బ్రిటీష్ పోలీసులు ఆలస్యంగా గుర్తించి వెంటనే ఉత్తరాలపై సైతం నిఘా పెట్టారు. ఉభయగోదావరి జిల్లాల్లో కొరియర్‌గా పనిచేసిన జగ్గరాజు 1932లో ఉద్యమానికి సంబంధించిన ఉత్తరాన్ని రహస్యంగా తుని చేరవేస్తుండగా పిఠాపురంలో పోలీసులు ఆయన్ను అడ్డగించారు. రహస్య సమాచారాన్ని గుర్తించి జగ్గరాజును తీవ్రంగా కొట్టి పంట పొలాల్లో పడవేశారు. కొన ఊపిరితో ఉన్న జగ్గరాజును స్థానికులు రక్షించడంతోపాటు స్వగ్రామానికి చేర్చారు.

సాధు ఆశ్రమంలోనే వైద్య సేవలు

వన్నెచింతలపూడిలో స్వాతంత్ర్యోద్యమకారుడైన నడింపల్లి సుబ్బరాజు (సాధురాజు) ప్రకృతి వైద్యునిగా పనిచేసేవారు. ఉద్యమంలో ఎవరికి గాయాలైనా ఆ ఆశ్రమానికి తరలించేవారు. వారికి వైద్యసేవలు అందించిన అనంతరం విశ్రాంతి తీసుకునేందుకు మరో ఆశ్రమాన్ని మరికొంత దూరంలో ఆయనే రహస్యంగా ఏర్పాటుచేశారు. స్వాతంత్ర్య యోధులెందరికో వైద్యసేవలను రాజు అందించారు.

మహాత్మునితో కలిసి నడిచిన వెంకటరత్నం

ఆగర్భ శ్రీమంతునిగా జన్మించిన కాశిన వెంకటరత్నం దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్ముడు చూపిన బాటలో నడిచారు. బండారులంకకు చెందిన వెంకటరత్నం 14వ ఏటనే స్వాతంత్ర్యోద్యమ బాటపట్టారు. మహాత్మాగాంధీతో కలిసి జైలు జీవితాన్ని గడిపారు. 1929 మే 5న కోనసీమ పర్యటనకు వచ్చిన మహాత్మునితో కలిసి వెంకటరత్నం పర్యటించారు. వెంకటరత్నం ఉద్యమం కోసం ఆస్తులు తరిగిపోతున్నా పట్టించుకోలేదు. టంగుటూరి ప్రకాశంపంతులు ప్రధాన అనుచరునిగా ఆయన గుర్తింపు పొందారు.



అమరుల నేల 'వాడపల్లి'

దేశభక్తితోపాటు దైవభక్తిని చాటుకున్న నేలగా వాడపల్లి చారిత్రకతను సంతరించుకుంది. 1931 మార్చి 30 ఏకాదశి రోజున శ్రీ వేంకటేశ్వరస్వామి కళ్యాణంలో భాగంగా రథోత్సవంపై మహాత్మాగాంధీ చిత్రపటాన్ని, జాతీయ పతాకాన్ని దేశభక్తులు ఎరుగవేశారు. గాంధీ చిత్రపటాన్ని, మువ్వెన్నల జెండాను తొలగించాలని బ్రిటీష్ పోలీసు అధికారి ముస్తాఫ్ఆలీఖాన్ ఆదేశించారు. దేశభక్తులు ఎంతకీ ససేమిరా అనడంతో కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో పలువురు అశువులుబాశారు. కొంతమంది గాయాలపాలయ్యారు. కోపోద్రిక్తులైన దేశభక్తులు.. ముస్తాఫ్ఆలీఖాన్ అనుకుని శానటరీ ఇన్‌స్పెక్టర్‌ను హతమార్చారు. 1987 అక్టోబరు 2న గాంధీ జయంతి నాడు మాజీ ఎమ్మెల్యే, గాంధేయవాది మంతెన వెంకట సూర్యసుబ్బరాజు ఆలయం వద్ద స్వాతంత్ర్య సమరయోధుల స్థూపాన్ని ఆవిష్కరించారు. ఇక్కడ రోడ్డు ఇరుకుగా ఉండడంతో కొత్తగా నిర్మిస్తున్న కోనేరు వద్ద స్మారక స్థూపాన్ని మార్పుచేయడానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చర్యలు చేపట్టారు.

- ఆంధ్రజ్యోతి, ఆత్రేయపురం



అలనాటి జ్ఞాపకాలు.. గాంధీజీ మ్యూజియం

స్వాతంత్ర్యోద్యమ సమయంలో 1921 నుంచి 1929 మధ్యలో మూడుసార్లు గాంధీజీ కాకినాడ వచ్చారు. గాంధీజీ ఇక్కడికి వచ్చినప్పటి విషయాలతోపాటు ఆయన బాల్యం నుంచి స్వాతంత్ర్యం సాధించి వరకు ఉన్న జీవిత ఘట్టాలను తెలియజేస్తూ కాకినాడ కార్పొరేషన్ వెనుక ప్రాంతంలో గాంధీభవన్ ఏర్పాటుచేశారు. ఇందులో గాంధీజీ మ్యూజియం, ఆయన చిత్రపటాలతోపాటు 400 కిలోల కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. ఆయనను నిత్యం స్మరించుకునేలా గాంధీనగర్లో ఓ పార్కుకు గాంధీపార్కుగా, ఓ ప్రాంతానికి గాంధీనగర్‌గా అప్పట్లోనే నామకరణం చేశారు. కాకినాడ గాంధీభవన్ పేరున కరపలో 5.87 ఎకరాల భూమి ఉంది. వేళంగి గ్రామానికి చెందిన మెర్ల వెంకట సుబ్బారావు 1952 ఆగస్టు 5న తన స్వార్జిత భూమిని గాంధీ భవన్ ట్రస్టుకు రాసిచ్చారు. ఇక కాకినాడలో గాంధీ మూడుసార్లు పర్యటించారు. 1921 ఏప్రిల్ 3న కాకినాడలో గాంధీజీ దంపతులు, వారి నాలుగో కుమారుడు రైలు దిగి గుర్రపు బండిపై జగన్నాథపురంలోని పైడా వెంకట నారాయణ ఇంటికి చేరుకున్నారు. 1923 డిసెంబర్ 28న గాంధీనగర్లో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ సభలకు నెహ్రూ, పటేల్ వంటి నేతలు విచ్చేయగా, పరవాడ జైలులో ఉన్న కారణంగా గాంధీ హాజరు కాలేదు. ఆ తర్వాత 1930, 1933ల్లో రెండు సార్లు కాకినాడ వచ్చారు.

- ఆంధ్రజ్యోతి, కాకినాడ కార్పొరేషన్

తొలిరోజు పండుగ ఇలా..



టంగుటూరి ప్రకాశంపంతులు ఆధ్వర్యంలో అప్పట్లో వెలువడిన స్వరాజ్య పత్రికలోనే స్వాతంత్ర్యోద్యమ సమాచారమంతా ఉండేది. అటువంటి మహనీయునితోపాటు క్రొవ్విడి లింగరాజు, బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం, డాక్టర్ నాగేశ్వరరావు, కళా వెంకట్రావు వంటి సమరయోధులను చూడగలిగాను. 1930 మే31న జన్మించాను. రాజమహేంద్రవరం ట్రైనింగ్ కళాశాలలో ఎస్ఎస్ ఎల్సీ పూర్తిచేసి 1947లో ఏలూరు సీఆర్‌రెడ్డి కళాశాలలో చేరాను. అదే సంవత్సరం ఆగస్టు 14వ తేదీ అర్ధరాత్రి దాటిన తరువాత దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించారు. 15వ తేదీ ఉదయం నుంచి కళాశాలలో పండుగ వాతావరణం నెలకొంది. తామంతా జాతీయ పతాకాలను చేతబూని ర్యాలీలు నిర్వహించాం.

- చీర్ల సాంబశివరావు, విశ్రాంత హెచ్ఎం, అమలాపురం



పేరూరు హైస్కూలులో ఫోర్తుఫారం చదువుతున్నా. ఎలా తెలిసిందో ఏమో 1947 ఆగస్టు 15వ తేదీ ఉదయం 5 గంటలకల్లా విద్యార్థులంతా పాఠశాలకు రావాలని ముందే హెచ్ఎం చెప్పారు. చెప్పినట్టుగానే పాఠశాలకు వెళ్లగా అక్కడంతా పండుగ వాతావరణమే. మహాత్మాగాంధీకి జై, వల్లభాయ్ పటేల్‌కు జై, సుభాష్‌చంద్రబోస్‌కు జై, నెహ్రూకు జై అంటూ విద్యార్థులంతా కలిసి జాతీయ పతాకాలను చేతబూని గ్రామమంతా ర్యాలీ నిర్వహించాం. ఉదయం అల్పాహారం అనంతరం స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపుతూ దేశభక్తిని చాటేలా ప్రదర్శనలు ఇచ్చారు. 1933 ఫిబ్రవరి 22న జన్మించిన నేను స్వాతంత్ర్య తొలి వేడుకల్లో పాల్గొనడం అదృష్టం.

- యిళ్ల వెంకట శ్రీనివాసరావు, విశ్రాంత డిప్యూటీ ఇనస్పెక్టర్ ఆఫ్ స్కూల్స్, అమలాపురం

మహాత్ముడు నడిచాడిచట.. 1933లో మహాత్మాగాంధీ సామర్లకోట రాక

మహాత్మాగాంధీ 1933లో సామర్లకోటలో పర్యటించారు. మహాత్ముడు తన శిష్య బృందంతో కలసి కలకత్తా(హౌరా) నుంచి మెయిల్ ఎక్స్‌ప్రెస్ రైలులో సామర్లకోట రైల్వే స్టేషన్‌కు డిసెంబరు 24న ఉదయం 11 గంటలకు చేరుకున్నారు. ఒకటో నంబరు ప్లాట్‌ఫాం నుంచి రైతు దిగిన గాంధీని చూసేందుకు జిల్లా నలుమూలల నుంచీ అధిక సంఖ్యలో ప్రజలు, అభిమానులు చేరుకోవడంతో సామర్లకోట రైల్వే స్టేషన్ ప్రజలతో కిక్కిరిసింది. అప్పటి కాంగ్రెస్ నాయకులు, భారత స్వాతంత్ర్యోద్యమంలో కీలకపాత్ర పోషించిన స్వాతంత్ర్య సమరయోధులు బులుసు సాంబమూర్తి తదితర నాయకుల ఆధ్వర్యంలో మహాత్మాగాంధీని ఘనంగా స్వాగతించారు. సామర్లకోట నుంచి ప్రత్యేక వాహనంపై ఆసీనులైన మహాత్మాగాంధీ పెద్దాపురం తరలివెళ్లారు. పెద్దాపురంలో ముప్పనవారి బంగ్లా ఆవరణలో జరిగిన భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. సుమారు పదిహేను వేల మంది సమీప ప్రాంతాల నుంచి ఈ సభకు హాజరుకావడం విశేషం. నాటి సభ ముగిసిన అనంతరం పెద్దాపురం మున్సిపాల్టీ పక్షాన ఛైర్మన్ ఎన్.సుబ్బారావుతో స్వాగతపత్రాన్ని, పౌరుల తరపున మరొక సన్మానపత్రాన్ని సభాముఖంగా చదివి వినిపించి అందించారు. అనంతరం గాంధీకి హరిజననిధికి రూ.501 విరాళాన్ని అందజేశారు.

- ఆంధ్రజ్యోతి, సామర్లకోట



నాగుల్లంకలో ఏర్పాటుచేసిన స్థూపం

సమరయోధుల గ్రామం నాగుల్లంక



స్వాతంత్ర్య సమరయోధుడు ఆరుమిల్లి సుబ్బారావుకు 1972లో ప్రభుత్వం అందించిన తామ్రపత్రం

స్వాతంత్ర్య ఉద్యమం జరిగిన సమయంలో పి.గన్నవరం మండలం నాగుల్లంక గ్రామానికి చెందిన 22 మంది వ్యక్తులు సమరంలో పాల్గొని దేశానికి స్వతంత్రం సంపాదించడంలో భాగస్వాములయ్యారు. అందుకుగాను అప్పట్లో ప్రభుత్వం 22 మందిలో ఐదుగురికి తామ్రపత్రాలు అందించి ఘనంగా సత్కరించారు. ఒకే గ్రామంలో 22 మంది స్వాతంత్ర సమరయోధులు ఉండడంతో ఆనాటి నుంచి ఆ గ్రామం స్వాతంత్ర సమరయోధుల గ్రామంగా ప్రసిద్ధిగాంచింది. అంతే కాకుండా స్వతంత్ర సమరంలో చేసిన సేవలకు గుర్తుగా ప్రధానపంటకాల్వకు వంతెన, కాల్వ చెంతనే వారి పేర్లతో స్థూపాన్ని ఏర్పాటుచేసి ప్రతి ఏడాది స్థానిక నాయకులతో కలసి గ్రామస్తులు ఆగస్టు 15న జాతీయ జెండాను ఎగురవేసి వారికి నివాళులు అర్పిస్తారు.

- ఆంధ్రజ్యోతి, పి.గన్నవరం



రాష్ట్ర స్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభిస్తున్న జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు

పిఠాపురంలో రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

13 ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు

పిఠాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాత బస్టాండు వద్ద గల మునిసిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నాలుగు రోజులు జరిగే రాష్ట్ర స్థాయి 10వ జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్, తూర్పు గోదావరి, పిఠాపురం బాస్కెట్‌బాల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీలను జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించారు. కొంతసేపు బాస్కెట్‌బాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో బాలబాలికల విభాగాల్లో పోటీలు జరిగాయి. కార్యక్రమంలో రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, రాష్ట్ర టెక్నికల్ కమిటీ ఛైర్మన్ పి.సురేష్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు (అయలు), పిఠాపురం అసోసియేషన్ అధ్యక్ష, కోశాధికారులు డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథ్, కొత్తెం సుందరకుమార్, నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.




బాలికల విభాగంలో తలపడుతున్న క్రీడాకారులు

గైనిక్ పేషెంట్లకు ప్రత్యేక ఓపీ


జీజీహెచ్ (కాకినాడ), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గైనిక్ పేషెంట్ల సౌకర్యార్థం కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేసినట్టు సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి గురువారం తెలిపారు. గైనిక్ విభాగంలోని ఎస్ఆర్ఎంటీ బ్లాక్ వద్ద తల్లీబిడ్డ విగ్రహం ఎదురుగా ఉన్న గేటులోకి రావాలన్నారు. ఓపీ టికెట్, డాక్టర్ కన్సల్టేషన్, రక్త పరీక్షలు, మందులు అన్నీ ఎస్ఆర్ఎంటీ బ్లాక్ వద్దే జరిగేలా ఏర్పాటు చేసినట్టు సూపరింటెండెంట్ వెల్లడించారు. ప్రజలు ఈ మార్పును గమనించి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

దుబాయ్‌లో వెల్డర్స్‌గా ఉద్యోగావకాశాలు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దుబాయ్ (యూఏఈ) దేశంలో వెల్డర్స్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కాకినాడ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. వయసు 24 నుంచి 45 సంవత్సరాలలోపు ఉండి, ఐటీఐ లేదా ఐటీసీ విద్యార్హత కలిగి నాలుగేళ్ల అనుభవం ఉండాలన్నారు. టీఐజీ లేదా ఏఆర్సీ మల్టీ వెల్డర్ ఉద్యోగానికి ఎంపికైన వారికి రూ.52వేల నుంచి రూ.61,500, టీఐజీ లేదా ఏఆర్సీ వెల్డర్ ఉద్యోగానికి రూ.42,500 నుంచి రూ.52వేల వరకు వేతనం ఇస్తారన్నారు. కాంట్రాక్ట్ కాలం రెండేళ్లు ఉంటుందన్నారు. ఉచిత వసతి, భోజనం, వైద్య సదుపాయాలు, రవాణా సౌకర్యాలతో పాటు స్వదేశానికి ఒకసారి వచ్చి వెళ్లడానికి టిక్కెట్ ఇస్తారన్నారు. రూ.35వేలు (వీసా, ట్రావెల్ టికెట్లు, క్యూసీసీ మొదలైన ఖర్చులకు). ఆసక్తి గల వారు పాస్‌పోర్టు, అనుభవం, సంబంధిత విద్యా ధ్రువపత్రాలతో ఆగస్టు 31వ తేదీలోగా వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8712655686, 9988853335, 8790118349, 8790117279 నెంబర్లను సంప్రదించాలని కోరారు..



డేవిడ్



హెబెల్

జాతీయ హాకీ పోటీలకు ఉప్పాడ కొత్తపల్లి విద్యార్థుల ఎంపిక

కొత్తపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఉప్పాడ కొత్తపల్లికి చెందిన చొక్కా డేవిడ్, మేరుగు హెబెల్ జాతీయ హాకీ పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల పీడీ, హాకీ కోచ్ రవిరాజు తెలిపారు. పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో ప్రారంభమైన 15వ హాకీ ఇండియా జూనియర్ హాకీ చాంపియన్‌షిప్‌లో వారు పాల్గొన్నారని తెలిపారు. క్రీడాకారులకు టేబుల్ టెన్నిస్ సీనియర్ క్రీడాకారుడు రావు చిన్నారావు, జనసేన నాయకులు డాక్టర్ జ్యోతుల శ్రీనివాసరావు, గంటా విజయ్‌కుమార్, పలువురు గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

నేనూ ర్యాగింగ్‌కు భయపడ్డా..

- అది ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుంది
- తూర్పు కలెక్టర్ ప్రశాంతి
- నన్నయ విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ వ్యతిరేక వారోత్సవాలు



కలెక్టర్ ప్రశాంతికి జ్ఞాపిక అందజేస్తున్న వీసీ, విద్యార్థులు

దివాన్‌చెరువు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తన జీవితంలో కూడా ర్యాగింగ్‌కు భయపడిన సంఘటనలు ఉన్నాయని, ర్యాగింగ్ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుందని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ర్యాగింగ్ వ్యతిరేక వారోత్సవాల్లో మూడో రోజైన గురువారం జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ర్యాగింగ్ ఉండని విద్యాలయాల్లో తమ పిల్లలను చేర్చడానికి తల్లిదండ్రులు ఇష్టపడతారని, పిల్లలు కూడా అటువంటి వాటిలో చేరడానికే సుముఖత చూపిస్తారన్నారు. విద్యా సంస్థల్లో ర్యాగింగ్‌కు భయపడి విద్యకు దూరమైన విద్యార్థులు అనేక మంది ఉన్నారన్నారు. తాను చదువుకునేటప్పుడు ర్యాగింగ్‌కు భయపడి సెలవులు పెట్టిన సందర్భాలు ఉన్నాయని, అటువంటి పరిస్థితులు ఏ విద్యార్థికి రాకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయాల గౌరవం, పేరు ప్రఖ్యాతులు విద్యార్థుల ప్రవర్తనపై ఆధారపడి ఉంటాయని, సీనియర్ విద్యార్థులు జూనియర్ల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలని, మార్గనిర్దేశకులుగా వ్యవహరించాలని సూచించారు. నన్నయ వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ర్యాగింగ్ ఒక వ్యక్తి మనస్సును మచ్చగా మార్చుతుందని, వారి కలలను పూర్తిగా నాశనం చేసే హానికరమైన చర్య అని అభివర్ణించారు. యూనివర్శిటీలో భయానికి స్థానం లేదని. ఆకాంక్ష, గౌరవం మాత్రమే ఉండేలా చూసుకుందామని చెప్పారు. రాజానగరం మహిళా ఎస్ఐ పి.నారాయణమ్మ శక్తి యాప్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తొలుత నన్నయ విగ్రహానికి కలెక్టర్, వీసీ పూలమాలలతో నివాళులర్పించారు.అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.కార్యక్రమం అనంతరం కలెక్టర్ ప్రశాంతిని వీసీ సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ కేవీ స్వామి, డీన్ ఎన్.ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీ మురళీకి మహోన్నత సేవా పతకం



రాజమహేంద్రవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో చేసిన సేవలకు జిల్లా అదనపు ఎస్పీ(పరిపాలన) ఎన్‌బీఎం మురళీకృష్ణకు రాష్ట్ర ప్రభుత్వ మహోన్నత సేవా పతకం లభించింది. 1989లో ఎస్ఐగా సర్వీసులో చేరిన మురళీ.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పలు హోదాల్లో పని చేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. నరసాపురం డీఎస్పీగా పని చేస్తూ అడిషనల్ ఎస్పీ ఉద్యోగోన్నతిపై తూర్పు గోదావరికి గత ఏడాది నవంబరులో వచ్చారు. మండపేట రూరల్, అంగర, పెదవేగి, చందర్లపాడు, అనపర్తి సర్కిల్, రాజమండ్రి టూటౌన్ పోలీస్ స్టేషన్లలో పని చేస్తున్న సమయంలో స్థానికుల సహకారంతో పోలీస్ స్టేషన్ భవనాలను నిర్మించారు. హైదరాబాద్‌కు చెందిన ఒక కేసు ఛేదనలో అద్వితీయమైన ప్రతిభ చూపినందుకు రూ.5 లక్షల రివార్డు అందుకున్నారు. 2009లో ఏలూరులో ఎలక్షన్ స్పెషల్ బ్రాంచి సీఐగా ఉన్నప్పుడు సేవా పతకం, 2017లో రామచంద్రాపురంలో డీఎస్పీగా ఉన్నప్పుడు ఉత్తమ సేవాపతకం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ కిషోర్, అడిషనల్ ఎస్పీలు అర్జున్(క్రైమ్స్), సుబ్బరాజు(శాంతి భద్రతలు), చెంచురెడ్డి(ఏఆర్), డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది మురళీ కృష్ణకు అభినందనలు తెలిపారు.

'ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు పెంచాలి'

వివిధ జిల్లాల ఆర్టీసీ ఆన్‌కాల్ డ్రైవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు



శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

పిఠాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీలో ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు పెంచాలని అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి గురువారం కాకినాడ జిల్లా పిఠాపురంలోని జనసేన కార్యాలయానికి వచ్చారు. తమ సమస్యల పరిష్కారానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవ తీసుకోవాలని కోరుతూ జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ప్రతినెలా వేతనంతో పాటు పీఎఫ్, ఈహెచ్ఎస్ తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. తమకు సరైన వేతనం లేదని, పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తే సమస్యలు పరిష్కారమవుతాయని ఇక్కడకు వచ్చామని వారు చెప్పారు.

పెరుగుతున్న గోదావరి

ధవళేశ్వరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో పాటు తెలంగాణ పరివాహకంలో లక్ష్మి బ్యారేజ్ నుంచి సుమారు 3లక్షల క్యూసెక్కులు నీరు విడుదల చేస్తుండడంతో గోదావరి ప్రవాహం స్వల్పంగా పెరుగుతోంది. గురువారం సాయంత్రానికి ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజ్ నుంచి 1,98,959 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. డెల్టా పరిధిలో విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల డెల్టా కాలువలకు సాగునీటి విడుదలను గణనీయంగా తగ్గించారు. తూర్పు డెల్టాకు 2000, మధ్య డెల్టాకు 700, పశ్చిమ డెల్టాకు 500 క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద క్రమంగా పెరుగుతున్న నీటి మట్టం గురువారం సాయంత్రానికి 19.60 అడుగులుగా నమోదయింది.

రేపు, ఎల్లుండి పోలవరం నిర్వాసిత ప్రాంతాల్లో

సీపీఎం నాయకుల పర్యటన

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి, ఫ్లోర్ లీడర్, రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఈ నెల 16, 17 తేదీల్లో పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత ముంపు ప్రాంతాల్లో పర్యటించనున్నారని తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్ తెలిపారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎం నాయకులు 16వ తేదీ ఉదయం 11గంటలకు మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంటారని, అక్కడి నుంచి పోలవరం దేవీపట్నం మండలంలో నిర్వాసిత గ్రామాల్లో పర్యటిస్తారన్నారు. 17న చింతూరు మండలంలోని నిర్వాసితుల కాలనీల్లో పర్యటిస్తారని తెలిపారు.



స్వాతంత్ర్య సందేశం..

– కడియం (ఆంధ్రజ్యోతి)

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా కడియం పల్ల వెంకన్న నర్సరీలో రైతులు సత్తిబాబు, వెంకటేష్, వినయ్ మొక్కలతో త్రివర్ణ పతాకం తీర్చిదిద్దారు. బోర్డర్ రకానికి చెందిన కొన్ని వేల మొక్కలతో మేడిన్ ఇండియా, ఇండిపెండెన్స్ వంటి అక్షర రూపాలు ఇవ్వడంతో పాటు 3రంగుల జెండా తీర్చిదిద్దారు. కూర్పులో 79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలను తెలుపుతూ అమెరికా వంటి సంపన్న దేశాలు తీసుకున్న నిర్ణయంతో రూపాయి విలువ తగ్గకుండా మనమే స్వదేశీ వస్తువులకు కొనుగోళ్లకు ప్రాధాన్యమివ్వాలని సందేశం ఇచ్చారు.

ఆనాటి ప్రయాణం.. నేటి ఉచితానికి మార్గం!


ఆలమూరులో రెండేళ్ల క్రితం బస్సులో ప్రయాణం చేసిన చంద్రబాబు చిత్రాలు




- కోనసీమ జిల్లా ఆలమూరులో రెండేళ్ల క్రితం ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసిన చంద్రబాబు
- ఉచిత బస్సు సౌకర్యం హామీపై ప్రయాణికులతో చర్చ
- స్త్రీ శక్తి పథకానికి అదే స్ఫూర్తి

ఆలమూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలందరికీ ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం నుంచి ఈ పథకం అమలులోకి వచ్చింది. స్త్రీశక్తి పేరుతో ఈ పథకాన్ని రూపొందించారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ 5 రకాల బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడైనా ఉచితంగా మహిళలు ప్రయాణించవచ్చు. ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు డాక్టర్ బీఆర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండల పర్యటనకు వచ్చినప్పుడు ఆలమూరు నుంచి జొన్నాడ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించి ఉచిత బస్సు సౌకర్యం హామీకి సంబంధించి మహిళా ప్రయాణికులతో చర్చించారు. 2023 ఆగస్టు 18న ఈ బస్సు ప్రయాణం చేశారు. ఈ పథకం రూపకల్పనకు సంబంధించి అనేక మంది మహిళా ప్రయాణికులతో ఆయన సమీక్షించి సూపర్ సిక్స్ హామీగా చేర్చారు. ఇప్పుడు ఆ పథకం అమలు చేస్తుండడంతో కొత్తపేట నియోజకవర్గంలో అప్పటి చంద్రబాబు ఆలమూరు బస్సు ప్రయాణం గుర్తించి చర్చించుకుంటున్నారు. ఉచిత బస్సు పథకానికి ఆలమూరు బస్సు ప్రయాణం స్ఫూర్తిగా భావిస్తున్నారు. ఆ ప్రయాణంలో చంద్రబాబు నాయుడుతో పాటు ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, మాజీ జడ్పీటీసీ దండంగి మమత తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు దొంగిలిస్తున్న ముగ్గురి అరెస్ట్

34 వాహనాలు స్వాధీనం

డీఎస్పీ రమేశ్ బాబు


రాజమహేంద్రవరంలో నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రమేశ్‌బాబు

రాజమహేంద్రవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం త్రీటౌన్ పోలీసులు ముగ్గురు దొంగలను అరెస్ట్ చేసి 34 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేశ్‌బాబు గురువారం వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గామన్ బ్రిడ్జి వద్ద త్రీటౌన్ సీఐ వి.అప్పారావు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు అనుమానాస్పదంగా ప్రవర్తించడంతో పోలీసులు ప్రశ్నించారు. ద్విచక్రవాహనాల దొంగతనాల కేసుల్లో వాళ్ల నిందితులుగా ఉన్నారని గుర్తించారు. దీంతో తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరానికి చెందిన కుప్పాల రంగారావు, స్నేహితులు గోపిరెడ్డి యోహాను, మెకానిక్ సిర్రా బంగారుబాబును అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేశారు. త్రీటౌన్, భీమవరం, గుడివాడ, ఏలూరు పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసులకు సంబంధించి 17 మోటారు సైకిళ్లతో కలిపి రూ.14లక్షల విలువైన మొత్తం 34 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. విధుల్లో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ వి.అప్పారావు, ఎస్ఐ వి.అప్పలరాజు, హెచ్ సీలు వి.కృష్ణ, ఎస్.వెంకటరామయ్య, కె.సురేశ్, చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు బి.విజయ్‌కుమార్, మహేశ్, పవన్‌ని ఎస్పీ నరసింహ కిషోర్ ప్రత్యేకంగా అభినందించారు.

ఇకపై అందరికీ ఒకే నియమావళి!

- ఎన్‌టీఆర్ భరోసా పింఛను అర్హత ధ్రువీకరణ పత్రాల మంజూరుకు నిబంధనలు విడుదల
- రాష్ట్రమంతా ఒకే నియమావళిని వర్తింపజేసేందుకు ఉత్తర్వులు జారీ
- వివరాలు వెల్లడించిన కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

జీజీహెచ్(కాకినాడ), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్‌టీఆర్ భరోసా ఆరోగ్య పింఛను పథకంలో అర్హులను గుర్తించి ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేసేందుకు రాష్ట్రమంతా ఒకే నియమావళిని వర్తింపజేసేందుకు ఉత్తర్వులు జారీ అయినట్టు కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో వివిధ దీర్ఘకాలిక వ్యాధుల బారినపడే వారిని నెలవారీ పెన్షన్లకు అర్హులుగా గుర్తిస్తామని డీఎంహెచ్‌వో వెల్లడించారు.

దీర్ఘకాలిక రుగ్మతలు, వాటికి వర్తించే పెన్షన్ల వివరాలివి..

రూ.10వేల పింఛను కేటగిరీ అర్హులు: తలసేమియా మేజర్ వ్యాధిగ్రస్తులు, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులు, అతి తీవ్ర హిమోఫీలియా వ్యాధిగ్రస్తులు, రెండు కాళ్లకు తీవ్ర బోద(గ్రేడ్-4) వ్యాధిగ్రస్తులు, 7 దీర్ఘకాలిక కిడ్నీవ్యాధితో డయాలసిస్ జరుగుతున్న, సీరం క్రియాటినిన్ 5కంటే ఎక్కువ లేదా కుంచించుకుపోయిన కిడ్నీ లేదా జీఎఫ్ఆర్ 15ఎంఎల్ కంటే తక్కువగా ఉన్న వ్యాధిగ్రస్తులు, కిడ్నీ లేదా కాలేయం లేదా గుండె మార్పిడి చేయించుకున్నవారు.

రూ.15వేల పింఛను కేటగిరీ అర్హులు: పక్షవాతంతో మంచానికి పరిమితమైన వ్యాధిగ్రస్తులు, సివియర్ మస్క్యులర్ డిస్ట్రోఫీతో మంచానికి పరిమితమైన వ్యాధిగ్రస్తులు.

రూ.6వేల పింఛను కేటగిరీ అర్హులు: బహుళ వైకల్యం కలిగిన కుష్ఠు వ్యాధిగ్రస్తులు, 40శాతం పైబడి దివ్యాంగత్వం ఉండి తెల్లరేషన్‌కార్డు కలిగినవారు.

పైఅనారోగ్యాలు కలిగిన వారికి ఎన్‌టీఆర్ భరోసా ఆరోగ్య పింఛను పథకంలో అర్హులను గుర్తించేందుకు ధ్రువపత్రాలు మంజూరుకు రాష్ట్రమంతా ఒకే నియమావళి ఉంటుందని, ధ్రువపత్రాల దాఖలు చేయడానికి ఈ కింది నిబంధనలు పాటించాలని డీఎంహెచ్‌వో తెలియజేశారు.

1. అర్హులకు జారీ చేసిన సర్టిఫికెట్లు అన్నీ పూర్తి సమాచారంతో ఉండాలి.
2. మెడికల్ సర్టిఫికెట్లపై ఏ రకమైన దిద్దుబాట్లు ఉండకూడదు.
3. మెడికల్ సర్టిఫికెట్‌పై జారీ చేసే ఆంధ్రప్రదేశ్ మెడికల్ బోర్డ్ డాక్టర్ల సంతకంతోపాటు స్టాంప్, పేరు, డాక్టర్ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ నెంబర్ తప్పనిసరిగా ఉండాలి.
4. ఎన్‌టీఆర్ భరోసా ఆరోగ్య పింఛను పథకంలో పైఅనారోగ్య విభాగాల్లో రోగి ఏ కోవకు చెందుతాడో వివరించి మంచానికి లేదా చక్రాల కుర్చీకే పరిమితమయ్యాడో తెలియజేసే ధ్రువీకరణ పత్రంలో పొందుపర్చాలి.
5. ఇప్పటికే ఎన్‌టీఆర్ భరోసా ఆరోగ్య పింఛను పొందుతున్న వారు, వారి పింఛను పెంచుకోవాలనుకుంటే సదరం ద్వారా నూతన మెడికల్ సర్టిఫికెట్ పొందేందుకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసేవారు కూడా సదరం పోర్టల్‌లో నమోదు చేసుకుని నూతన మెడికల్ సర్టిఫికెట్ దాఖలు చేయాలని డీఎంహెచ్‌వో సూచించారు.
6. తీవ్ర అనారోగ్యంతో మంచానికి పరిమితమైన రోగులు అనవసరంగా కార్యాలయం చుట్టూ తిరగవద్దని ఆయన తెలిపారు. దీనిపై మరింత సమాచారం కావాల్సిన వారు డీఎంహెచ్‌వో కార్యాలయంలోని ఎన్‌టీఆర్ భరోసా ఆరోగ్య పింఛన్ల డీఈవో(కాకినాడ జిల్లా)ను 7981604598 నెంబరులో కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్ కోరారు.

రామచంద్రపురం జడ్పీటీసీ మేర్నీడి మృతి


మేర్నీడి (ఫైల్)

ద్రాక్షారామ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండల జడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వర రావు(59) కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ తరపున జడ్పీటీసీగా వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ద్రాక్షారామ పీఏసీసీఎస్ అధ్యక్షుడిగా పనిచేశారు. మేర్నీడి మృతి పట్ల మంత్రి సుభాష్, రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సంతాపం తెలిపారు. మృతదేహానికి మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, ఏపీఐడీసీ మాజీ డైరెక్టరు శ్యామ్, ఎంపీపీ అంబటి భవానీ నివాళులర్పించారు.

హోంగార్డుపై అత్యాచారం కేసు

ముమ్మిడివరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): హైవే మొబైల్ వాహనంపై పనిచేస్తున్న హోంగార్డుపై గురువారం ముమ్మిడివరం పోలీసుస్టేషన్‌లో అత్యాచారం కేసు నమోదైంది. కోనసీమ జిల్లా కాట్రేనికోన పోలీసుస్టేషన్‌లో హోంగార్డుగా ఉన్న బి.నాగరాజు హైవే మొబైల్ వాహనంపై పనిచేస్తున్నాడు. ముమ్మిడివరానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతో ఆమె ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. న్యాయం జరగడంలో జాప్యంతో ఆమె ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. దీంతో ముమ్మిడివరం పోలీసులు నాగరాజుపై కేసు నమోదు చేశారు.

ఆసుపత్రికెళ్తుండగా ఆగిన ఆయువు

వ్యాన్ ఢీకొని తండ్రి మృతి

సురక్షితంగా బయటపడ్డ కుమారుడు


బాలకృష్ణ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

తాళ్లరేవు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెం బైపాస్ వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్టు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. కాజులూరు మండలం శీలలంక గ్రామానికి చెందిన జల్లి బాలకృష్ణ (45) తన మూడేళ్ల కుమారుడికి ఆర్యోగం బాగోలేకపోవడంతో కుమారుడిని తీసుకుని ద్విచక్రవాహనంపై ముమ్మిడివరం ఆసుపత్రికి బయల్దేరాడు. వారి వాహనాన్ని సుంకపాలెం మంగళ్‌ఎంటర్‌ప్రైజెస్ ప్రాంతంలో వెనుక నుంచి వచ్చిన బొలెరో వ్యాన్ ఢీకొంది. దీంతో బాలకృష్ణ తలకు బలమైన గాయాలుకావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారుడు సురక్షితంగా బయటపడ్డాడు. బాలకృష్ణ భార్య 6నెలల గర్భిణి అని తెలిసింది. బాలకృష్ణ మృతదేహాన్ని అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పోలీసులు తరలించారు. ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘నగరం’లో అర్బయిన్ కార్యక్రమాలు ప్రారంభం

మామిడికుదురు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఇరాక్‌లోని కర్బలా పుణ్యభూమిలో ఇమామ్ హుస్సేన్ అతని 72 మంది పరివారం వీర మరణం పొందిన సంఘటన జరిగిన 40 రోజులు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతీ సంవత్సరం నిర్వహించే అర్బయిన్ కార్యక్రమాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం నగరంలో ఇమామ్ అలీరజా పంజాలో మజ్లిస్ జరిగింది. అనంతరం హమారీలను తీసి నౌహాలను ఆలపిస్తూ ఒంటెలపై నగరంలోని మంజిలే కర్బలా వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అక్కడ ఉరుహేతాజ్‌దారే పురాత్ ఆధ్వర్యంలో మజ్లిస్ జరిగింది. ఈ మజ్లిస్‌లో మత గురువు కర్బలా పుణ్యభూమిలో జరిగిన సంఘటనను భక్తులకు వివరించగా కన్నీరుమున్నీరుగా విలపించారు. కార్యక్రమాల్లో అధికంగా భక్తులు పాల్గొన్నారు.


కోనసీమ జిల్లా నగరంలో ఒంటెలపై హమారీలు ఊరేగింపు చేస్తున్న ముస్లింలు

పవన్, మోహన్‌బాబు సినిమాలకు పాటలు రాశా

ప్రముఖ సినీగేయ రచయిత మాస్టర్‌జీ



ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను కలిసిన ప్రముఖ సినీ గేయ రచయిత మాస్టర్‌జీ

పి.గన్నవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఉద్యమ గీతాలకు సంబంధించి ఇప్పటి వరకు 1000 వరకు పాటలు రాశానని ప్రముఖ సినీగేయ రచయిత గంగాధరి మాస్టర్‌జీ అన్నారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం జనసేన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను కలిసిన ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఇప్పటివరకు 25 సినిమాల్లో పాటలు రాశానని... ముఖ్యంగా పవన్‌కల్యాణ్, మోహన్‌బాబు సినిమాలకు పాటలు రాశానని చెప్పారు. రంగులకల, అడవి నాతల్లిరో, మనో రమ సినిమాల్లో పాటలు పాడానని, 6 సినిమాల్లో నటించానని చెప్పారు. ముఖ్యంగా తాను రాసిన అందుకో దండాలు బాబా అంబేడ్కరా, పవన్ కల్యాణ్ నటించిన జానీ సినిమాలో నారాజు గాకుర మా అన్నయా, గుడుంబా శంకర్ సినిమాలో కిల్లి కిల్లి నమిలాకా బాగున్నదే నాగమల్లి పాటలకు మంచి స్పందన వచ్చిందని ఆయన చెప్పారు. తెలుగు యునివర్శిటీ, ఆచార్య నాగార్జున యునివర్శిటీ, తెలుగు అకాడమీల నుంచి అవార్డులు పొందానని చెప్పారు. ప్రస్తుతం రెండవగది సినిమాతో పాటు మరో కొత్త సినిమాకు పాటలు రాస్తున్నానని చెప్పారు. వచ్చే నెలలో హైదరాబాద్‌లోని జరగనున్న విశ్వజన కళామండలి 49వ వార్షికోత్సవ కార్య క్రమానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను ఆహ్వానించడానికి వచ్చినట్టు మాస్టర్‌జీ పేర్కొన్నారు.

అంబులెన్స్ ఢీకొని విద్యార్థికి తీవ్ర గాయాలు

కరప, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేళంగిలో గురువారం మధ్యాహ్నం అంబులెన్స్ ఢీకొని విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, కరప పోలీసుల వివరాల ప్రకారం.. వేళంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పి.పవన్‌భాస్కర్ హెచ్‌ఈసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. లంచ్ బ్రేక్ సమయంలో కళాశాల బయటకు వచ్చి రోడ్డుపక్కన ఉన్న షాపు వద్దకు వెళ్లి వస్తుండగా కాకినాడ నుంచి మండపేటకు డిశ్చార్జ్ పేషెంట్‌ను తీసుకెళ్తున్న అంబులెన్స్ వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. విద్యార్థి తలకు తీవ్రగాయమవ్వగా అధ్యాపకులు స్థానిక పీహెచ్‌సీకి తరలించి ప్రథమచికిత్స చేయించారు. మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అంబులెన్స్‌ను స్థానికులు వెంబడించి నిత్యానందపురంసెంటర్‌లో అదుపులోకి తీసుకుని డ్రైవర్, అంబులెన్స్‌ను కరప పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

కిలోలు 100 ధర రూ.8,800

అంతర్వేదిలో భారీ సొర చేప

అంతర్వేది, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బరులో వేటకు వెళ్లిన మత్స్యకారులకు అరుదైన భారీ సొర చేప వలకు చిక్కింది. 100 కిలోల పైనే ఉన్న చేపకు వేలం పాట నిర్వహించగా రూ.8,800కు పలికింది.



కొబ్బరిముక్కలు.. కోట్లు!

సత్యదేవుడి సన్నిధిలో కొబ్బరిముక్కలు పోగు చేసుకునేందుకు బహిరంగ వేలం

ఏడాదికి రూ.2.28 కోట్లు చెల్లించేందుకు గుత్తేదారు హెచ్చుపాట

అన్నవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కొబ్బరిముక్కలు సత్యదేవుడికి సిరులు కురిపించాయి. స్వామి వారి దర్శనం వ్రతమండపాల్లో భక్తులు టెంకాయిలు కొట్టి వదిలివెళ్లిన కొబ్బరిముక్కలు పోగు చేసుకునేందుకు నిర్వహించిన బహిరంగ వేలంలో ఒక గుత్తేదారు ఏకంగా సంవత్సరానికి రూ.2.28 కోట్లు దేవస్థానానికి చెల్లించేందుకు హెచ్చుపాటను దక్కించుకున్నారు. గతేడాది వేర్వేరుగా నిర్వహించిన వేలంలో ఏడాదికి హెచ్చుపాట రూ.87.12 లక్షలు కాగా ఈ ఏడాది భారీస్థాయిలో ఆదాయం సమకూరింది. వీటితోపాటుగా బుకింగ్‌కౌంటర్ ఎదురుగా ఉన్న షాపింగ్‌కాంప్లెక్స్‌లో కొబ్బరికాయలు, ఇతర వస్తువులు విక్రయించుకునే లైసెన్స్‌హక్కుకు శుక్రవారం నిర్వహించిన వేలం ద్వారా ఏడాదికి రూ.45.47 లక్షలు హెచ్చుపాట దక్కించుకున్నారు. గతంలో ఇదే లైసెన్స్‌హక్కుకు రూ.27.96 లక్షలు మాత్రమే ఆదాయం సమకూరింది. ప్రకాష్‌సదన్ వెనక ప్రారంభించనున్న మొబైల్ క్యాంటీన్ లైసెన్స్ హక్కుకు తొలిసారి వేలం నిర్వహించగా రూ.33.84 లక్షలకు హెచ్చుపాట ఖరారయ్యింది. జ్యూస్‌పాయింట్ విక్రయ లైసెన్స్ హక్కు తక్కువ మొత్తానికి వెళ్లడంతో ఆ లైసెన్స్ హక్కు వేలం వాయిదా వేశారు. దేవదాయ కమిషనర్ అనుమతితో టెండర్లు ఫైనల్ చేస్తామని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ వీవీరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నవరంలో ఉచిత వరలక్ష్మి వ్రతాలు

ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం ఉచిత సామూహిక శ్రావణ శుక్రవార వరలక్ష్మి వ్రతాలు నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు నిత్యకల్యాణ మండపంలో ప్రారంభమవుతాయని, ఆసక్తి కలిగిన మహిళా భక్తులు వీటిలో పాల్గొనవచ్చన్నారు. మహిళలు టెంకాయి, అరటిపళ్లు తీసుకునివస్తే పూజాసామగ్రి, రవికల వస్త్రం, అమ్మవారి రాగిరూపు తదితర వాటిని దేవస్థానం సమకూరుస్తుందని ఈవిషయాన్ని గమనించాలని కోరారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

డ్రైవర్‌కు గాయాలు



ఘటనా స్థలంలో ఆటో,బస్సు.. ఆటోడ్రైవర్

ముమ్మిడివరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్న సంఘటనలో ఆటోడ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం కోనసీమ జిల్లా అమలాపురం నుంచి ఐ.పోలవరం మండలం తిలకుప్ప వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముమ్మిడివరం మండలం ఆర్టీసీ సెంటర్‌లో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. ఈ సంఘటనలో ఆటోడ్రైవర్ అయిన కాట్రేనికోన మండలం దొంతికుర్రుకు చెందిన ఎలిపే కిశోర్ తీవ్రంగా గాయపడ్డాడు. అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే ప్రమాదం జరిగిన సమయంలో ఆటోలో ప్రయాణికులెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ముచ్చటగా ముగ్గురు..

ఒకే కాన్పులో ఒక మగ, ఇద్దరు ఆడపిల్లల జననం... కొత్తపేటలో అరుదైన సంఘటన


తల్లి దుర్గ


ఒకే కాన్పులో పుట్టిన పిల్లలు

కొత్తపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో గురువారం అరుదైన సంఘటన జరిగింది. మహిళకు ఒకే కాన్పులో ముగ్గురు బిడ్డలు జన్మించారు. ఈదరపల్లికి చెందిన కుంపట్ల దుర్గ గర్భిణి కావడంతో కొత్తపేటలోని భాస్కర చిల్డ్రన్ ఐవీఎం ఆసుపత్రి వైద్యుడు ప్రదీప్తికరుణను సంప్రదించింది. స్కానింగ్‌లో ముగ్గురు శిశువులు ఉండడాన్ని గుర్తించి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆమెకు 8 నెలలకే నొప్పులు రావడంతో గురువారం ఆపరేషన్ ద్వారా మగబిడ్డ, ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. తల్లి, పిల్లలు క్షేమంగా ఉన్నారని.. పర్యవేక్షణలో ఉంచామని డాక్టర్ ప్రదీప్తికరుణ తెలిపారు.

జాతీయస్థాయి పారా ఒలింపిక్ పోటీలకు ముమ్మిడివరం విద్యార్థి


పార్థుసంజీవ సాగర్

ముమ్మిడివరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ముమ్మిడివరం కొత్తలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థి సబ్బతి పార్థుసంజీవసాగర్ జాతీయస్థాయి పారా ఒలింపిక్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రత్యేక విద్యా ఉపాధ్యాయుడు గంగుల సురేష్ తెలిపారు. ఏపీ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామస్వామి నుంచి గురువారం ఉత్తర్వులు అందాయి. ఈనెల29న మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పార్థు పాల్గొననున్నాడు. విద్యార్థిని డీఈవో షేక్ సలీంబాషా, ఎంఈవోలు గౌరీశంకర్, ఉదయసాగర్, ఐఈ కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, ఎంఎస్సీ చైర్మన్ జైను బాబ్జి, హెచ్‌ఎమ్ గోవర్ధనగిరి, ఉపాధ్యాయులు అభినందించారు.

చవితి ఉత్సవాలకు పందిరి రాట

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక 23వ వార్డు నందివాడ వారి వీధిలో వజ్రగణపతి ఆలయంలో చవితి ఉత్సవాలకు గురువారం ఉదయం రాట ముహూర్తం చేశారు. చందా సత్రం మాజీ చైర్మన్ వాకచర్ల కృష్ణ, సూర్యకుమారి దంపతులు, పొత్తూరి యతిరాజు, సంపత్‌కుమార్ రేణుక దంపతులు పూజలు నిర్వహించి రాట వేశారు. కార్యక్రమంలో పొత్తూరి సత్యనారాయణ, పేరకం వెంకట సీతారామ్, మారడుగుల సుబ్బయ్య, వాసంశెట్టి సుబ్బారావు, యలమర్తి చిరంజీవి, యడ్ల రామారావు పాల్గొన్నారు.

అనపర్తి: అనపర్తిలోని ఎర్రకాలువ గట్టుపై రావిచెట్టు వద్ద విజయ గణపతి చవితి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయ వ్యవస్థాపకుడు కర్రి రామారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తేతలి రాధాకృష్ణారెడ్డి, తేతలి నారాయణరెడ్డి, మల్లిడి ఆదినారాయణరెడ్డి, డాక్టర్ తేతలి అరుణ వీర్రెడ్డి దంపతులు, వెలగల గంగిరెడ్డి దంపతులు, వేగిరెడ్డి సత్తిరెడ్డి దంపతులు, కర్రి సుధాకరరెడ్డి, మండ రామారెడ్డి పాల్గొన్నారు.

సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలి

బిక్కవోలు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను సాంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలని ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ సూచించారు. మండలంలోని కొమరిపాలెం పంచాయతీ ఆవరణలో గురువారం ఆయన చవితి ఉత్సవ కమిటీలతో సమావేశం జరిపారు. ఉత్సవాల పేరుతో అశ్లీల నృత్యాలు చేయించరాదని, గుండాటలు నిర్వహించరాదన్నారు. పర్యావరణాన్ని కాపాడే మట్టి విగ్రహాలనే వాడాలన్నారు. నిమజ్జనాల సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి రవి, డీవీఆర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా వేడుకలు

రాజానగరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): హర్ ఘర్ తిరంగా వేడుకలను మండలంలోని పలు విద్యా సంస్థల్లో గురువారం నిర్వహించారు. రాజానగరం సమీపంలోని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ)లోని ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని వీసీ యు.చంద్రశేఖర్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు, అధికారులు జీజీయూ ఎదుట మువ్వన్నెల పతాకాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, ప్రిన్సిపాల్ టి.జయానందకుమార్, డీన్లు ఎన్.లీలావతి, ఆర్ఎస్ రాజు, ఎస్ఎస్ఎన్ రాజు, రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్, ఎస్ఐ కేవీ నాగార్జున, ఎస్ఎస్ పీవోలు బి.శ్రీనివాస్, షేక్ మీరా పాల్గొన్నారు. కెఎల్ఆర్ లెనోరా దంత వైద్య కళాశాలలో 72 అడుగుల పొడవైన జాతీయ పతాకాన్ని రూపొందించి ఆవిష్కరించి,ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికి జాతీయ జెండాను ఏర్పాటు చేసి విస్తృత ప్రచారం చేశారు. విద్యార్థినులకు రంగోలి, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నాగమణి, డైరెక్టర్ నాగార్జున రెడ్డి, ప్రిన్సిపాల్ విశ్వప్రకాష్ శెట్టి, పీజీ డైరెక్టర్ లక్ష్మణరావు, వైస్ ప్రిన్సిపాల్ దల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: రాజమహేంద్రవరం ఆదిత్య కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు, హర్‌ఘర్ తిరంగా ర్యాలీని స్థానిక ఆర్టీసీ బస్ కాంప్లెక్స్, వీఎల్ పురం, తిలక్ రోడ్డు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రతినిధులు జీవీఎస్ నాగేశ్వరరావు, బీహెచ్ రమాదేవి, ఎ.శిరీష, బి.విమల ఆధ్వర్యంలో జరిగింది.

జీఎస్ఎల్‌కు ఎకో కార్డియో మిషన్ బహూకరణ

రాజానగరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రికి రూ.25 లక్షల విలువైన 2డి ఎకో కార్డియోగ్రామ్ పరికరాలను కోటక్ మహీంద్ర బ్యాంక్ బహూకరించింది. దానికి బ్యాంకు ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, రవికిరణ్ మండలి గురువారం ఉదయం ప్రారంభించినట్టు జీఎస్ఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ గ్రంధి రామకృష్ణ తెలిపారు. ఈ పరికరాలను కార్పొరేట్ సోషల్ రిస్పాన్స్‌బులిటీ (సీఎస్ఆర్)కింద కోటక్ బ్యాంక్ బహూకరించిందన్నారు. దీని ద్వారా నిరుపేదల గుండె పరీక్షలకు మరింత వెసులుబాటు కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని కార్డియాలజీ విభాగంతో పాటు స్మార్ట్ ల్యాబ్, గ్రీన్ లైబ్రరీని రవికిరణ్ సందర్శించారు. ఎకో కార్డియోగ్రామ్ పరికరాలను అందించిన రవికిరణ్‌ను జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు అభినందించారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

రైట్‌లో సినీనటుడు ప్రదీప్

దివాన్‌చెరువు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సానుకూల ఆలోచనలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సినీనటుడు, రచయిత ప్రదీప్ కొండపర్తి అన్నారు. భూపాలపట్నంలోని రైట్ ఇంజనీరింగ్ కళాశాలలో పవర్ యువర్ మైండ్, మై లైఫ్ ఈజ్ మై చాయిస్ అనే అంశాలపై విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్.. దృక్పథం, విజ్ఞానం, నైపుణ్యంల ప్రాముఖ్యతను తెలియజేశారు. విజయం సాధించడానికి కష్టపడేతత్వం, అంకితభావం, వ్యక్తిత్వ వికాసానికి సానుకూల ఆలోచనలు, ఆత్మస్థైర్యం అవసరమని అన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ అడ్డాల శ్రీహరి, చైర్మన్ జి.సాయిరాధాకృష్ణ, పి.రవికిరణ్, ప్రిన్సిపాల్ కె.భాస్కరముత్యాలు పాల్గొన్నారు.

మెళ్లూరు గ్రామాభివృద్ధికి భూలోకం కృషి

బిక్కవోలు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మెళ్లూరు గ్రామాభివృద్ధికి చవ్వాకులు పెదభూలోకం ఎంతగానో పాటుపడ్డారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గ్రామంలో ఆయన పేరుతో నిర్మించిన ఉన్నత పాఠశాలలో ఆయన కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన భూలోకం, సతీమణి సుందరమాణిక్యం విగ్రహాలను, సుందరమాణిక్యం పేరుతో నిర్మించిన కళావేదికను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో హైస్కూల్, పంచాయతీ ఏర్పాటుకు భూలోకం స్థలం ఇచ్చారన్నారు. 1983 నుంచి నల్లమిల్లి మూలారెడ్డికి అన్ని విషయాల్లో చేదోడు వాదోడుగా వుండేవారన్నారు.అంతకు ముందు గ్రామంలో రూ.3 లక్షలతో అభివృద్ధి చేసిన అంగన్వాడీ భవనాన్ని ఎంపీపీ తేతలి సుమ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెదిరెడ్డి సాయిరాం, కుటుంబీకులు రాంబాబు, రాజబాబు, నాయకులు కొప్పిశెట్టి వేణుగోపాలరెడ్డి,ఇందల వీరబాబు, చింతా శ్రీనివాసరెడ్డి,దుర్గారెడ్డి, రెడ్డి శ్రీను పాల్గొన్నారు.

పులివెందులలో విజయంపై సంబరాలు

కడియం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంపై గురువారం కూటమి నాయకులు కడియంలో సంబరాలు చేశారు. కేకు కట్ చేసి మిఠాయిలు పంచారు. బాణసంచా కాల్పులు జరిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, పాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల మండలాధ్యక్షులు వెలుగుబంటి నాని, బొర్సు సుబ్రహ్మణ్యం, ముద్రగడ జమీ, నాయకులు చిలుకూరి నాగేశ్వరరావు, చిక్కాల ఈశ్వరరావు, చిలుకూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రెండు వర్గాలపై బైండోవర్ కేసులు

గోకవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): గోకవరంలో తరచూ గొడవలు పడుతున్న రెండు వర్గాలపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ పవన్‌కుమార్ గురువారం తెలిపారు.విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు వర్గానికి, బీజేపీ మండలాధ్యక్షుడు ఇనగోటి బాపన్నదొర వర్గానికి మధ్య నెలకొన్న గొడవల దృష్ట్యా శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు.

ఉచిత సామూహిక వివాహాలు

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక క్వారీ ఏరియా సంహాచలనగర్‌లోని శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ధర్మకర్తలు కాలెపు సూర్య సింహాచలం, నాగేశ్వరావు ఆధ్వర్యంలో గురువారం ఉదయం సామూహిక వివాహాలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి హాజరైన 17 జంటలకు వివాహాలను జరిపించారు.మంగళసూత్రం, మట్టెలు, మధుపర్కాలు పూజా సామగ్రిని ఆలయం తరపున సమకూర్చారు. విందు ఏర్పాటు చేశారు.





కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

సాగు, తాగునీటి భద్రతకు చర్యలు

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): భగర్భ జలాల రీచార్జికి, సాగు, తాగునీటి నీటి భద్రతకు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కాలువలు, చెరువుల సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. ఆయా వినియోగదారుల సంఘాలు పూర్తి బాధ్యత వహించాలన్నారు. గురువారం సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ విధానంలో నిర్వహించిన జిల్లాల వారీ సమీక్షలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె వివరాలను వెల్లడిస్తూ.. నీటి వినియోగదారుల సంఘాలు, అధికారులు,ప్రజా ప్రతినిధులతో నీటి భద్రత, భూగర్భ జలాల రీచార్జి, కాలువలు, చెరువుల నిర్వహణ తదితర అంశాలపై సమగ్ర చర్యలు నిర్వహించామన్నారు. జిల్లాలోని గోపాలపురం, అనపర్తి, గోకవరం మండలాల్లో బోరుబావులపై అధికంగా ఆధారపడడం వల్ల భూగర్భ జలాల స్థాయి తగ్గిందన్నారు. గోదావరి డెల్టా మండలాల్లో మాత్రం సాధారణ స్థాయిలో ఉన్నాయన్నారు. భూగర్భ జలాల రీచార్జి కోసం నీటి కుంటలను తవ్వించే పనులను ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపడతామని సీఎంకి వివరించారు.సాంకేతిక మార్గదర్శకాలు అందించాలని కోరారు. అనంతరం జిల్లా అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. కాలువలు ఆక్రమణలకు గురికాకుండా, తూడు తొలగింపు, పూడిక తీత పనులను చేపట్టి, శివారు భూములకు కూడా నీరు వెళ్లే విధంగా నీటి వినియోగదారుల సంఘాలు, అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. తాగు, సాగు, పరిశ్రమలకు నీళ్లు చాలా అవసరమన్నారు. అందువల్ల నీటి భద్రతలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. రానున్న రోజుల్లో క్యాచ్‌మెంట్ ఏరియాల వారీగా ఇరిగేషన్ అధికారులను కేటాయించి, రైతులు, నీటి సంఘాల సమన్వయంతో ఆయా ప్రాంతాల్లో నీటి భద్రత, భూగర్భ జలాల మెరుగుదలకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో జేసీ చిన్న రాముడు, ఇరిగేషన్ ఎస్ఈ గిరిధర్, చీఫ్ ఇంజనీర్ శేషబాబు, తొర్రిగడ్డ పంపింగ్ స్కీం అధ్యక్షుడు వేగి శ్రీనివాసరావు, సూరంపాలెం ప్రాజెక్టు అధ్యక్షుడు ఉంగరాల రాములు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



నల్లా చానల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే సమాజం, వారి కుటుంబం అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక అంబేద్కర్ నగర్‌లోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో బీసీ కార్పొరేషన్ సహకారంతో మూడు నెలల పాటు కుట్టు మిషన్ శిక్షణ పొందిన సుమారు 200మంది మహిళలకు గురువారం వీడ్కోలు సమావేశం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని నారాయణపురం, తుమ్మలావ, దబ్బావారి సత్రం, మునిసిపల్ కాలనీలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాల్లో సుమారు 628 మహిళలు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి సంబంధించి సబ్సిడీ జమ విషయంలో తలెత్తుతున్న సాంకేతిక లోపాలను అధిగమించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, సబ్సిడీ సొమ్ము ఇవ్వడం కంటే గ్యాస్ సిలిండర్ అందించేందుకు యోచన చేస్తోందని వివరించారు. 13వ డివిజన్ ఇన్‌చార్జి కప్పల వెలుగు కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన సిటీ అధ్యక్షుడు వైశ్రీను, మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధ,కొల్లు బుజ్జి, కిలపర్తి శ్రీను, బొర్రా చిన్ని, ఈతలపాటి రవి, కంటిపూడి రాజేంద్రప్రసాద్, యర్రంశెట్టి రాజ్‌కుమార్, బంగారు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా చూడాలి

గోదావరి గట్టునున్న నల్లా చానెల్ వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కార్పొరేషన్ అధికారులకు సూచించారు. గురువారం ఉదయం కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే నల్లా చానల్‌ను పరిశీలించారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నీట మునిగే ప్రాంతాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు.చానల్ వద్ద నీటిని తోడే మోటార్లు మొరాయించకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైతే హైపవర్ మోటార్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇక వరదలు వస్తే నగరంలో నీట మునిగే ప్రాంతాలను దృష్టిలో పెట్టుకుని అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఆయా ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రణాళికలు చేసుకోవాలని అధికారులకు సూచించారు.

పీ4తో పేదలకు భరోసా

అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



పీ4 అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి పేద కుటుంబాన్ని బంగారు కుటుంబంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పీ4 కార్యక్రమాన్ని రూపొందించారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం అనపర్తిలోని టీజీఆర్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ స్థాయి పీ4 అవగాహన సదస్సును ఆయన ప్రారంభించి ప్రసంగించారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 678 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. వాటిని పారిశ్రామికవేత్తలు, ఉద్యోగులు, వైద్యులు వంటి వారు దత్తత తీసుకోవడం ద్వారా ఆ కుటుంబ అవసరాలను గుర్తించి వారి ఎదుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కుటుంబాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనేక మార్గాలను చూపుతుందని వారికి మార్గదర్శకులుగా నిలవడమేనని అన్నారు. ఎంపీ డీవో ఎం.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పీ4 ముఖ్య ఉద్ధేశ్యాన్ని వివరించి, అనుమానాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి ప్రేమ్‌కుమార్, అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పడాల సుబ్బారెడ్డి, రామలింగారెడ్డి, సబ్బెళ్ల అమ్మిరెడ్డి, తేతలి ఉపేంద్రరెడ్డి, వైద్యులు డాక్టర్ తాడి రామగుర్రెడ్డి, డాక్టర్ కర్రి సునీల్ కుమార్‌రెడ్డి, డాక్టర్ రామానందసాగర్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీటీసీల గెలుపుపై హర్షం

కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో కూటమి విజయం సాధించడం పట్ల కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అనపర్తి దేవీచౌక్ వద్ద బాణసంచా కాల్చి సందడి చేశారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి కేక్ కట్ చేయగా మనోజ్‌రెడ్డి ఆయనకు తినిపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్‌రెడ్డి అడ్డాగా చెప్పుకునే పులివెందులలో డిపాజిట్ కూడా రాలేదంటే సిగ్గుపడాలని, ఈ విజయం వైసీపీ అధినేతకు చెంపపెట్టని అన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి

పలు సొసైటీల త్రిసభ్య కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమాల్లో చైర్మన్లు



ప్రమాణ స్వీకారం చేసిన పందలపాక, కానవరం, వంగలపూడి, దోసకాయలపల్లి సొసైటీల త్రిసభ్య కమిటీలు

బిక్కవోలు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కృషి చేస్తామని పలు సొసైటీల చైర్మన్లు అన్నారు. బిక్కవోలు మండలం పందలపాక, మెళ్లూరు సొసైటీల త్రిసభ్య కమిటీలు గురువారం బాధ్యతలు చేపట్టాయి. పందలపాక సొసైటీ చైర్మన్‌గా పడాల సూర్యనారాయణరెడ్డి, సభ్యులుగా గుణ్ణం శ్రీనివాస చౌదరి, కర్రి సత్యనారాయణ, మెళ్లూరు సొసైటీ చైర్మన్‌గా చవ్వాకుల వేణుగోపాలకృష్ణ సభ్యులుగా కొర్ల వినాయకరావు, కొమ్మన రామచంద్రరావు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వీరిని సర్పంచ్‌లు సబ్బారపు పద్మావతి, పెదిరెడ్డి సత్యసాయిరామ్, కూటమి నాయకులు పడాల చినబుజ్జి, అనుసూరి నాగేశ్వరరావు, సబ్బారపు సూర్యనారాయణ, రెడ్డి శ్రీను, తొండాపు అబ్బు, చవ్వాకుల చిన అచ్యుతరామయ్య,గంగుమళ్ల శ్రీనివాస్ అభినందించారు.

రాజానగరం: మండలంలో కానవరం, భూపాలపట్నంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల చైర్మన్లుగా నియమితులైన నాతిపాం దొరబాబు, మద్దిరెడ్డి బాబులు గురువారం వేర్వేరుగా ప్రమాణ స్వీకారం చేశారు. దీనిలో భాగంగా తొలుత రాజానగరంలోని జనసేన పార్టీ కార్యాలయం నుంచి భారీ బైక్ ర్యాలీగా బయలుదేరారు. అనంతరం ఉదయం 11.30 గంటలక ఆయా గ్రామాల్లోని సొసైటీల్లో ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని వంగలపూడి సొసైటీ చైర్మన్‌గా మద్దిపాటి సుజిరాజు,సభ్యులుగా ముత్యం విజయలక్ష్మి, మద్దంశెట్టి వీర వెంకట్రావు ప్రమాణ స్వీకారం చేశారు.కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గెడ్డం తిమ్మారావు, గద్దే వెంకటకృష్ణ చౌదరి(నల్లి) పెందుర్తి అచ్యుతరామారావు, సింగవరం సర్పంచ్ సంగన పోసియ్య, కొంచ చంద్రభాస్కర్. సొసైటీ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

కోరుకొండ: మండలంలోని దోసకాయలపల్లి సొసైటీ చైర్మన్‌గా సూదిన గంగాధర్, సభ్యులుగా కర్రి రాజారావు, గల్లా శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. వారితో సీతఃవో కొయిడాల శివ అప్పలరాజు సొసైటీ మినిట్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేయించారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, కంటే నాగ కేశవరావు,గాజంగం అప్పారావు, ఉల్లి విష్ణు ప్రసాదరావు, మద్దిపాటి వెంకన్నదొర, బుద్దా బాపూజీ, రాము, వీరాంజనేయులు పాల్గొన్నారు.

సొసైటీలను భ్రష్టు పట్టించారు: బీవీఆర్

గత వైసీపీ పాలనలో సొసైటీలను భ్రష్టుపట్టించారని, అనేక సొసైటీల్లో అవినీతి, అక్రమాలు జరిగినట్టు పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయని వాటన్నిటిపైన విచారణ జరుగుతుందని రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి పేర్కొన్నారు. దోసకాయలపల్లి పీఏసీఎస్ పాలక వర్గం ప్రమాణ స్వీకారానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ సీతానగరం మండలం వెదుళ్లపల్లి సొసైటీలో రూ.1.60 కోట్లు, కోరుకొండ మండలం శ్రీరంగపట్నం సొసైటీలో రూ.1.40కోట్లు అక్రమాలు జరిగినట్టు అధికారుల విచారణలో వెల్లడైందని , అలాగే మరికొన్ని సహకార సంఘాల్లో కూడా అవినీతి అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాని వీటిపై కూడా అధికారులు వీటిపై సమగ్ర విచారణ చేపట్టారన్నారు. కొన్ని సొసైటీల్లో పాలక వర్గాలు, అధికారులు, స్థానిక నాయకత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నష్టాల ఊబిలోకి చిక్కుకు పోయాయన్నారు.

ఉచిత బస్సు ప్రయాణానికి సర్వం సిద్ధం

గోకవరం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): కూటమి సూపర్‌సిక్స్ పథకాల్లో ఒకటైన స్త్రీశక్తి(ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం) పథకం ఈ నెల 15 నుంచి అమలు చేయనున్నారు. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఆ పథకాన్ని గోకవరం ఆర్టీసీ డిపో నుంచి ఎమ్మెల్యే ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించనున్నట్టు డిపో మేనేజర్ మార్గరేట్ తెలిపారు. ఈ సందర్భంగా డిపోను స్వీపర్లతో శుభ్రం చేయించడం జరిగింది. చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారిపోతున్న డిపో ముందు భాగంలో సిమ్మెంట్ రోడ్డు, ప్రయాణికులకు తాగునీరు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.మహిళలకు కేటాయించిన సీట్లకు రంగులు అద్దారు. చిన్నపాటి మరమ్మతులు పూర్తిచేశారు. మహిళలు నిల్చుంటే పట్టుకునేందుకు వీలుగా హ్యాంగర్లు ఏర్పాటు చేశారు. ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం ఉండడంతో కండక్టర్లు, డ్రైవర్లకు ప్రత్యేక సూచనలు జారీ చేశారు.


58 సర్వీసులు.. స్థానిక ఆర్టీసీ డిపో నుంచి 9 రూట్లలో మొత్తం 58 సర్వీసులు నడపనున్నట్టు డీఎం తెలిపారు. వీటిలో 44 ఆర్టీసీ బస్సులు ఉండగా, 14 అద్దె బస్సులు ఉన్నాయి.రోజూవారీ సుమారు 2000 మంది మహిళలు ప్రయాణిస్తుంటారు. స్త్రీశక్తి పథకంతో ఆసంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు ఎస్టీఐ అప్పారావు తెలిపారు.అలాగే ఆదాయం పెరగొచ్చని మేనేజర్ చెప్పారు.

దేశ విభజన పరిస్థితులపై ఫొటో ఎగ్జిబిషన్



రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దేశ విభజన కాలం నాటి ఎందరో దేశభక్తులు, మహనీయులు, స్వాతంత్ర్య సమర యోధులు ఎదుర్కొన్న పరిస్థితులను వివరిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని పుష్కరఘాట్‌లో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. విభజన్ కా విభీషణ్ దివస్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను పార్టీ జాతీయ కార్యవర్గసభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ విభజన సమయంలో చనిపోయిన లక్షల మంది ప్రజల గురించి తెలియజేయాలనేదే బీజేపీ ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, బొమ్ముల దత్తు, ఎనుముల రంగబాబు, మద్దిపాటి రజనీ, రవిశంకర్ పాల్గొన్నారు.
















వందేమాతరం!

మదిమదిలో జాతీయత ఉప్పొంగింది. జై భారత్ నినాదాలతో ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల ర్యాలీ హోరెత్తింది. 57 అడుగుల భారీ జాతీయ జెండా చేతపట్టుకుని వై.జంక్షన్, నందం గనిరాజు సెంటర్, కంబాలచెరువు మీదుగా తిరిగి కళాశాల వరకూ ర్యాలీ కొనసాగింది. విద్యార్థులతో పాటు ప్రిన్సిపాల్ రామచంద్రరావు, యూత్ రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ జీ.రవితేజ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సుభాషిణిదేవి, మురళీకృష్ణ, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ అనూష పాల్గొన్నారు.



ఆర్టీసీ షీ ఉచితం!

ఈ బస్సుల్లోనే ఉచిత ప్రయాణం..

జిల్లాలో రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, గోకవరం నాలుగు డిపోల పరిధిలో అన్ని రకాల బస్సులు కలిపి ఆర్టీసీకి మొత్తం 205 సొంత బస్సులు, 78 అద్దె బస్సులు ఉన్నాయి. వీటిలో ఆర్టీసీ, అద్దె బస్సులు కలిపి... 37 ఎక్స్‌ప్రెస్‌లు, 27 అల్ట్రా పల్లెవెలుగు, 167 పల్లెవెలుగు ఉండగా, స్త్రీ శక్తి పథకంలో ఈ బస్సుల్లోనే బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా రాకపోకలు సాగించవచ్చు. డిపోల వారీగా చూస్తే రాజమహేంద్రవరం డిపోలో 22 ఎక్స్‌ప్రెస్‌లు, 15 అల్ట్రా పల్లెవెలుగు, 64 పల్లెవెలుగు బస్సులు ఉన్నాయి. గోకవరం డిపోలో 14 ఎక్స్‌ప్రెస్‌లు, 12 అల్ట్రా పల్లెవెలుగు, 30 పల్లెవెలుగు బస్సులు ఉన్నాయి. కొవ్వూరు డిపోలో ఒక ఎక్స్‌ప్రెస్ మాత్రమే ఉంది. 42 పల్లెవెలుగు బస్సులు ఉన్నాయి. నిడదవోలు డిపోలో కేవలం 31 పల్లెవెలుగు బస్సులు ఉన్నాయి.

- నేటి నుంచి స్త్రీశక్తి పథకం అమలు
- ఇక బస్సెక్కితే మహిళలకు ఫ్రీ
- గుర్తింపుకార్డు చూపించాలి
- సర్కారు ఆగస్టు 15 కానుక
- జిల్లావ్యాప్తంగా 283 బస్‌లు
- టిమ్స్‌లో ప్రత్యేక బటన్ ఏర్పాటు
- నాన్‌స్టాప్, ఇంటర్ స్టేట్‌లకు నో

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ శుక్రవారం నుంచి స్త్రీ శక్తి పథకం అమలుకు సిద్ధమవుతోంది. స్త్రీలకు పంద్రాగస్టు కానుకగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రారంభిస్తోంది. ఇక బాలికలు,స్త్రీలు, ట్రాన్స్‌జెండర్లు జీరో ఫేర్ టిక్కెట్‌తో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా వెళ్లి రావచ్చు.తూర్పుగోదావరి జిల్లాలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఈ ఉచిత ప్రయాణ పథకం అందుబాటులోకి వస్తుంది. నాన్‌స్టాప్ సర్వీసులు, అంతర్రాష్ట్ర సర్వీసులకు ఉచిత ప్రయాణ పథకం వర్తించదని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొనడంతో రాజమహేంద్రవరం-కాకినాడ నాన్‌స్టాప్ సర్వీసులు, భద్రాచలం అంతర్రాష్ట్ర బస్సుల్లో మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత ప్రయాణం అనుమతించరు. అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, స్టార్ లైనర్, సప్తగిరి,ఏసీ బస్సులతో పాటు పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిపే స్పెషల్ సర్వీసుల్లోనూ ఉచిత ప్రయాణం వర్తించదు.

జీరో టిక్కెట్..



స్త్రీలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు జీరో ఫేర్ టిక్కెట్ జారీ చేస్తారు. స్త్రీ శక్తి టిక్కెట్లపై తాము ప్రయాణించే దూరానికి టిక్కెట్ చార్జీ ఎంతవుతుందో ఆ మొత్తం ముద్రించి ఉంటుంది. దానికింద ప్రభుత్వ రాయితీ అంతే మొత్తాన్ని పేర్కొంటారు. చివరన టిక్కెట్ చార్జీ జీరోగా చూపిస్తారు.దీనివల్ల ప్రభుత్వం నుంచి తాము ఎంత లబ్ధిపొందాం అనేది మహిళలు తెలుసుకుంటారని ప్రభుత్వం భావిస్తోంది. స్త్రీ శక్తి పథకం అమలులో గందరగోళానికి తావులేకుండా టిక్కెట్లు జారీ చేసే మెషీన్ (టిమ్స్)లో ప్రత్యేకంగా ఉమెన్ ఫ్రీ టిక్కెట్ (డబ్ల్యుఎఫ్‌టీ) పేరిట ప్రత్యేకంగా ఒక బటన్ ఏర్పాటు చేశారు. బాలికలు, స్త్రీలు, ట్రాన్స్‌జెండర్లకు జీరో ఫేర్ టిక్కెట్ ఇవ్వడానికి ఈ ఒక్క బటన్ ప్రెస్ చేస్తే చాలు ప్రింటెడ్ టిక్కెట్ వస్తుంది. పురుషులకు గతంలో మాదిరిగానే ప్రయాణ దూరానికి అనుగుణంగా చార్జీలను నిర్దేశించి టిక్కెట్లు ఇస్తారు.

నేటి సాయంత్రం 5 గంటల నుంచి..

శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి స్త్రీ శక్తి పథకం అమల్లోకి వస్తుంది.సీఎం చంద్రబాబు రాష్ట్రస్థాయిలో ఈ పథకాన్ని ప్రారంభించే సమయంలోనే జిల్లాలోనూ మంత్రులు, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు జిల్లాలోని నాలుగు డిపోల్లో స్త్రీ శక్తి పథకం ప్రారంభిస్తారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సాయంత్రం జరిగే కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభిస్తారు.ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. గోకవరం,కొవ్వూరు, నిడదవోలు డిపోల్లో ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు ప్రారంభిస్తారు.

స్త్రీ శక్తి అమలుకు సిద్ధంగా ఉన్నాం..



స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి అమల్లోకి వస్తుంది.జిల్లాలో స్త్రీ శక్తి పథకం అమలుకు సిద్ధంగా ఉన్నాం. టిక్కెట్ తీసుకునే సమయంలో ఆర్టీసీ సిబ్బందికి తగిన గుర్తింపుకార్డు చూపించి జీరో టిక్కెట్ పొందాలి. టిక్కెట్ల జారీకి సంబంధించి ఎలాంటి గందరగోళానికి తావులేకుండా ఆర్టీసీ సిబ్బందికి ఇప్పటికే తగిన శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించాం.

వైఎస్ఎన్ మూర్తి, జిల్లా ప్రజారవాణా అధికారి



జెండా పండుగకు సర్వం సిద్ధం

నేడు ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహణ



రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో శుక్రవారం నిర్వహించే 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశామని జేసీ ఎస్.చిన్నరాముడు వెల్లడించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో వేడుకల ఏర్పాట్లను ఇతర శాఖల అధికారులతో కలిసి గురువారం జేసీ చిన్నరాముడు పరిశీలించి తగు సూచనలు చేశారు. అధిక వర్షం పడితే సుబ్రహ్మణ్య మైదానం వద్ద నిర్వహించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 14 శాఖలకు చెందిన శకటాలు, స్టాల్స్, ప్రదర్శన, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఆయన వెంట ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, ఆర్ఎంసీ ఏడీసీ పీవీ రామలింగేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి ఉన్నారు.



రాజమహేంద్రవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవానికి ముందస్తు కసరత్తులో భాగంగా ఎస్పీ నరసింహ కిషోర్ రిహార్సల్స్ నిర్వహించారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. సాయుధ పోలీస్ బలగాల పరేడ్ తిలకించారు.



విద్యుత్ కాంతుల్లో కార్పొరేషన్ కార్యాలయం



త్రీ..రంగదే!

స్వాతంత్ర్య దినోత్సవ వేళ మూడు మార్పులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో నేటి నుంచి మూడు రకాల కీలక నిర్ణయాలు అమల్లోకి రానున్నాయి. వీటి ద్వారా ఇకపై పలు వర్గాలకు స్వేచ్ఛ లభించనుంది. ముఖ్యంగా మహిళలు,యువతులు, హైవేలపై ప్రయాణించే వాహనదారులు, అన్నదాతలు లబ్ధిపొందనున్నారు. నేటి నుంచి అమల్లోకి రానున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,హైవే టోల్‌గేట్ల దోపిడీ నుంచి బయటపడేలా కొత్త ఫాస్టాగ్ వార్షిక పాస్, కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీయే. ఈ మూడు కీలక నిర్ణయాల అమలుతో ఆయా వర్గాల్లో ఆనందం వెల్లువిరుస్తోంది.

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- బాలికలు,మహిళలు,ట్రాన్స్‌జెండర్లకు ఆధార్‌తో ఫ్రీ
- హైవే ప్రయాణానికి ఫాస్టాగ్ వార్షిక పాస్
- రూ.3 వేలు చెల్లిస్తే 200 సార్లు ఛాన్స్
- రాజ్‌మార్గ్‌యాత్ర యాప్ ద్వారా పాస్‌లు
- రైతులకు కొత్త పాస్‌బుక్‌లు నేటి నుంచే

నేటి నుంచి ఫ్రీ..

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేటి సాయంత్రం నుంచి అందుబాటులోకి రానుంది. పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా బాలికలు, మహిళలు,ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా ప్రయాణించే సౌలభ్యం అందుబాటులోకి రానుంది. కేవలం ఆధార్‌కార్డు చూపించి రాష్ట్రమంతటా ఉచితంగా ప్రయాణించొచ్చు. ఈ మేరకు ఈపథకాన్ని సీఎం చంద్రబాబు నేటి సాయంత్రం ప్రారంభించనున్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో అడ్డగోలుగా ఆర్టీసీ చార్జీలను పెంచేసి పేదల నడ్డి విరగ్గొట్టింది. ఈ నేపథ్యంలో ఎన్నికలకు ముందు టీడీపీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రకటించి నేటి నుంచి అమలు చేస్తోంది.ఉమ్మడి జిల్లాలో దాదాపు 38 లక్షల మందికిపైగా మహిళలు లబ్ధిపొందనున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 11 ఆర్టీసీ డిపోల పరిధిలో 532 పల్లెవెలుగు, ఆల్ట్రాపల్లె వెలుగు బస్సులు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు 191, కోనసీమలో 176 పల్లెవెలుగు, తూర్పుగోదావరిలో పల్లెవెలుగు,ఆల్ట్రాపల్లె వెలుగు,ఇతర బస్సులు 283 ఉన్నాయి.ఎక్స్‌ప్రెస్ బస్సులు వంద వరకు ఉన్నాయి. వీటన్నింటిలోను మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుకానుంది.

హైవేపై హాయిగా...

కేంద్రప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన వార్షిక ఫాస్టాగ్ పాస్ అమల్లోకి రానుంది. తద్వారా కేవలం రూ.3 వేల ఫాస్టాగ్ తీసుకుని దేశంలో ఏ హైవేపై ఉన్న టోల్‌ప్లాజా ద్వారా ఫ్రీగా ప్రయాణించవచ్చు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం గురువారం అర్ధరాత్రి 12 గంటల నుంచి అమల్లోకి వచ్చింది.ఈ పాస్ ద్వారా ప్రయాణించే వెసులుబాటు కార్లు, వ్యాన్‌లు, జీపులు ఇతర వ్యక్తిగత అవసరాలకు వినియోగించే వాటికే వర్తిస్తుంది. ఈ విధానం వల్ల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వాహనదారులకు భారీగా ప్రయోజనం కలిగించనుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఐదు టోల్‌ప్లాజాలు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉన్నాయి.ఆయా టోల్‌గేట్లు వద్ద నిర్దీత రుసుంను ఫాస్టాగ్ ద్వారా చెల్లించాలి. వీటితో పాటు తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న కొవ్వూరు వద్ద మరో టోల్ ప్లాజా ఉంది. ఇది రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన ఏపీఆర్‌డీసీ ఆధీనంలో ఉంది. ప్రస్తుతం ఈ టోల్‌ప్లాజాల ద్వారా వెళ్లే ప్రతి వాహనానికి టోల్‌ఫీని వాహనానికి ఉన్న ఫాస్టాగ్ ద్వారా చెల్లించాలి. ఒక వేళ ఫాస్టాగ్ సొమ్ములు లేకున్నా..ఫాస్టాగ్ లేకున్నా నిర్దీత రుసుము కంటే 100 శాతం అదనంగా చెల్లించాలి. కొత్త విధానంలో ఫాస్టాగ్ రీచార్జి తరచూ చేసుకునే ఇబ్బంది లేకుండా ఏడాది రుసుం చెల్లించే విధంగా కేంద్రం కొత్త నిర్ణయం తీసుకొచ్చింది. ఈ ఫాస్టాగ్ యాన్యువల్ పాస్‌కు ఏడాదికి రూ.3 వేలు చెల్లించాలి.ఇలా రీచార్జి చేయించిన వాహనం దేశవ్యాప్తంగా ఏ టోల్‌ప్లాజా ద్వారానైనా 200 సార్లు ప్రయాణించే అవకాశం ఉంది. ఏడాది లేదా 200 సార్లు ఏది ముందైతే దానిని పరిగణనలోకి తీసుకుంటారు.వాణిజ్య అవసరాలకు తిరిగే వాహనాలకు అవకాశం ఉండదు.రాష్ట్ర రహదారులు, ఇతర ప్రాంతాల్లో టోల్‌గేట్ల వద్ద సాధారణ పద్ధతి లో ఫాస్టాగ్ ద్వారా టోల్ ఫీ చెల్లించాలి.తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు వద్ద సాధారణ ఫాస్టాగ్ ద్వారానే టోల్‌ఫీ చెల్లించాలి. ఫాస్టాగ్ యాన్యువల్ పాస్ రాజ్‌మార్గ్ యాత్ర యాప్ లేదా ఎన్‌హెచ్ఏఐ అధికారిక వెబ్‌సైట్ నుంచి పొందవచ్చు.

టోల్ ఫీజు 15 రూపాయలే..

ఏడాది లేదా 200 సార్లు తిరిగేందుకు వీలుగా ఫాస్టాగ్ తీసుకోవడం వల్ల వాహనదారులకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది. దీనివల్ల ఒక ట్రిప్పునకు రూ.15 మాత్రమే పడుతుంది. గొల్లప్రోలు టోల్‌ప్లాజా ద్వారా కారు, జీపు, వేన్‌లకు ఒకవైపు రూ.50 రుసుం ఉంది. దీని ప్రకారం 200 సార్లు ఇవి తిరిగితే పాత పద్ధతిలో రూ.10 వేలు అవుతుంది. కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద 200 ట్రిప్పులకు రూ.22 వేలు, ఈతకోట వద్ద టోల్ ప్లాజా వద్ద రూ.25వేలు అవుతుంది. రాష్ట్రంలోని ఇతర టోల్‌ప్లాజాల వద్ద ఇంతకంటే అధిక రుసుములు వసూలు చేస్తున్నారు. నూతన విధానంలో ఒక్కొక్కచోట రూ.15 మాత్రమే కట్ అవుతుంది. దాంతో 200 సార్లకు రూ.3 వేలు చెల్లిస్తే సరిపోతుంది. బ్యాలెన్స్ అయిపోతే మళ్లీ రీచార్జి చేసుకుంటే అదే ప్యాకేజీ వర్తిస్తుంది.

రైతులు పాస్..పాస్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి రైతులకు ప్రభుత్వం కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేయనుంది. భూసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు కొత్త పాస్ పుస్తకాలను అధికారులు అందించబోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అసలు పాస్‌పుస్తకాల జారీయే పెద్దగా జరగలేదు. అప్పటి సీఎం జగన్ అస్తవ్యస్త విధానాలతో చేపట్టిన భూసర్వే పేరుతో మరింత తలనొప్పి పెరిగింది.ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మునుపటిలా ఆంధ్రప్రదేశ్ రాజముద్రతో కొత్త పాస్ పుస్తకాల జారీకి రెవెన్యూశాఖ నిర్ణయించింది. ఎట్టకేలకు ఇవన్నీ ప్రింటింగ్ పూర్తి చేసుకుని జిల్లాలకు చేరుకున్నాయి. గత వైసీపీ హయాంలో కాకినాడ జిల్లా 15 మండలాల పరిధిలో 269 గ్రామాలు, తూర్పుగోదావరి జిల్లా 19 మండలాల్లో 190 గ్రామాలు, కోనసీమ జిల్లాలో 150 కిపైగా గ్రామాల్లో సర్వే చేశారు. నేటి నుంచి రీసర్వే పూర్తిచేసుకున్న గ్రామాల్లో పంపిణీ చేయనున్నారు.కాకినాడ జిల్లాలో 1.47 లక్షలు, కోనసీమ జిల్లాలో 1.02 లక్షలు,తూర్పుగోదావరి జిల్లాలో 95 వేల వరకు పాస్ బుక్‌లు ఇవ్వనున్నారు.ఇకపై స్వేచ్ఛగా రైతులు భూముల క్రయవిక్రయాలు,బ్యాంకు రుణాలు తెచ్చుకోవచ్చు.



తాళ్లపూడిలో నీట మునిగిన పాఠశాల

రాజమహేంద్రవరంలో నీట మునిగిన రోడ్డుపై ఇలా..

ముంచిన వాన

రాజమహేంద్రవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి) : వాతావరణం మారింది.. నిన్నటి వరకూ ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు.. అయితే బుధవారం మధ్యాహ్నం నుంచి వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందుతున్నారు. చల్లదనాన్ని ఆస్వాదిస్తున్నారు.గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం చల్లగానే ఉంది. బుధవారం పలు ప్రాంతాల్లో మొత్తం 957 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా సరాసరి వర్షపాతం 50.4 మిల్లీ మీటర్లు. ఉండ్రాజవరం మండలంలో ఉదయం 8.30 గంటల వరకూ ఏకంగా 180.6 మిల్లీమీటర్లు, పెరవలిలో 170.6, నల్లజర్లలో 120 మిల్లీ మీటర్లు అత్యధిక వర్షపాతం నమోదైంది. గోపాలపురం మండలంలో 8.2 మిల్లీమీటర్ల అతి తక్కువ వర్షపాతం నమోదైంది. కొద్దిపాటి వర్షానికి పల్లపుప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ పి.ప్రశాంతి జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. పల్లపు ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని..ముంపు ముప్పు ఉన్న పాఠశాలలకు సెలవుపై నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆమె జేసీ ఎస్. చిన్నరాముడు, డీఆర్వో టి.సీతారామమూర్తి, ఇతర అధికారులతో కలసి క్షేత్రస్థాయి అధికారులకు దిశానిర్దేశం చేశారు. గోదావరి పరీవాహక ప్రాంతాలు, కాలువలు, చెరువుల వద్ద ముందస్తుగా హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు. ఏటిగట్లు పటిష్టతపై తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.నష్టాలు అంచనా వేసి కచ్చితమైన గణాంకా లతో 24 గంటల్లోపు నివేదికలు అందజేయాలని ఆదేశించారు.ఇప్పటికే జిల్లా,డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రెండు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షం ఖరీఫ్ సీజన్‌కు మేలు చేస్తుందని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు తెలిపారు. ప్రస్తుతం వరినాట్లు మునిగినా త్వరగానే తేలిపోతాయన్నారు. ఇంకా మరింత ఎక్కువగా మరిన్ని రోజులు వర్షం పడితే కాస్త ఇబ్బంది అవుతుందని, దానికి అనుగుణం రైతులు చర్యలు చేపట్టాలన్నారు.

తాళ్లపూడిలో దంచికొట్టింది!

తాళ్లపూడి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల రహదారులు వర్షపు నీటికి గురువారం నీట మునిగాయి. మండలంలోని వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ వర్షం నీటితో చెరువులా తయారైంది. నీరు బయటకు పోయే దారిలేక ఆ ప్రాంగణం మొత్తం నీటితో నిండిపోయింది. తాళ్లపూడి మెయిన్ రోడ్డులో డ్రైనేజీ వ్యవస్థ లేక కురిసిన వర్షంనీరు రోడ్డుమీదే నిలిచి పో తోంది.దీంతో గ్రామస్తులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు.



నీట మునిగిన తాళ్లపూడి మెయిన్‌రోడ్

హోటల్ నిర్మిస్తే భూమిస్తాం : కలెక్టర్

రాజమహేంద్రవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి) : రానున్న గోదావరి పుష్కరాల సందర్భంగా రాజమహేంద్రవరంలో హోటల్ నిర్మాణం చేపట్టేవారికి నామమాత్రపు ధరలకే భూములు కేటాయిస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఆమె జిల్లాలోని హోటల్ యజమానుల అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. పుష్కరాలకు రోజుకు లక్ష మందికి వసతి కల్పించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. చిన్నహోటళ్లు, కాంప్లెక్స్‌లు నిర్మించదలచిన వారికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. శాశ్వతలేదా తాత్కాలిక గదులు నిర్మించడానికి ప్రతిపాదనలు సమర్పిస్తే వాటిని పరిశీలించి ముందుకు తీసు కెళతామన్నారు.

ఇస్కాన్‌ంతులు



రాజమహేంద్రవరంలో ఇస్కాన్ టెంపుల్ చూడడానికి రెండు కళ్లూ చాలవు.. విద్యుత్ కాంతులతో నిండిపోయింది.. కృష్ణాష్టమి శనివారం సందర్భంగా ఆలయ ఆవరణ అంతా ప్రత్యేక విద్యుద్దీపకాంతులు ఏర్పాటు చేశారు.. గురువారం రాత్రి నుంచే ఆలయం ఇలా కళకళలాడింది.. పెద్ద ఎత్తున భక్తుల హాజరై తిలకించారు.

తల్లిదండ్రుల కలలు సాకారం చేయండి : ఎస్పీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల కలలను సాకారం చేయడానికి ప్రతి విద్యార్థి కృషి చేయాలన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించిన 57 మంది పోలీసు పిల్లలకు ప్రోత్సాహక బహుమతులను ఎస్పీ నరసింహ కిషోర్ గురువారం అందజేశారు. ఉన్నత లక్ష్యాలు పెట్టుకుని వాటిని సాధించి సమాజంలో విజయ వంతమైన వ్యక్తులుగా ఎదగాలన్నారు. పిల్లలు చదువుతోపాటు వివిధ రంగాల్లో రాణించే విధంగా ప్రోత్సహించాలన్నారు. పోలీసులు, వారి కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తనను నేరుగా సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, చెంచి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ జైలు కెళతావా.. నరకానికెళతావా!

- అత్యధిక పాపాలు చేసింది నువ్వే
- జగన్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే ముప్పిడి మండిపాటు
- తీరు మార్చుకోవాలని హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, చిత్రంలో కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, తదితరులు

కొవ్వూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఖబడ్దార్ జగన్మోహనరెడ్డి.. చంద్రబాబు గురించి మాట్లాడే అర్హత నీకుందా అని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మండిపడ్డారు. సీఎం చంద్రబాబు నరకానికి వెళతాడని జగన్ అనడంపై కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. నరకానికి వెళ్లాల్సి వస్తే జగన్మోహనరెడ్డి మొదటి ప్లేస్‌లో ఉంటాడన్నారు. ఆయన వెనకాల మద్యం, లిక్కర్, మైనింగ్ స్కామ్‌లలో ఉన్న వైసీపీ దళారులు ఉంటారన్నారు. తండ్రి పదవిని అడ్డుపెట్టుకుని కోట్లాది రూపాయలు దోచుకుని 16 నెలలు జైలుకు వెళ్లి వచ్చిన వ్యక్తి జగన్‌రెడ్డి అన్నారు. సొంత తల్లి, చెల్లెలిని మోసం చేసి ఆస్తి మొత్తం కాజేసి వారిని రోడ్డునపడేశాడన్నారు. సొంత బాబాయిని చంపించిన వ్యక్తి నువ్వు కాదా అంటూ నిలదీశారు. రాష్ట్రాన్ని దోచుకుతింటే నిన్ను 11 సీట్లకు పరిమితం చేశారు. ఒకరకంగా రాష్ట్రం నుంచి బహిష్కరించినట్టుగా ఓటర్లు తీర్పునిచ్చారన్నారు.అయినా బుద్ధి రాలేదా అన్నారు. దళితులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు చేయించిన ఉసురు కొట్టింది కాబట్టే 11 సీట్లకు పరిమితం అయ్యావన్నారు. ఇన్ని తప్పులు చేసిన నువ్వు నరకానికి వెళతావే, శాశ్వతంగా నీ మీద ఉన్న కేసులు రుజువైన తరువాత చంచల్‌గూడ జైలుకు వెళతావే తెలుసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఆర్థికలోటు ఉన్నప్పటికీ వైసీపీ ప్రభుత్వంలో చేసిన రూ.10 లక్షల కోట్ల అప్పులను అధిగమించి, ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు నాయకత్వంలో పులివెందుల, ఒంటిమిట్ట స్థానిక ఎన్నికలు మొట్టమొదటిసారిగా ప్రజాస్వామ్యబద్ధంగా జరిగాయన్నారు. ప్రజలంతా స్వేచ్ఛ గా ఓటు విని యోగించుకున్నారన్నారు. దీనిని జీర్ణించుకోలేక చంద్రబాబుకు చివరి ఎన్నికలు, నరకానికి పోతావ్ అంటున్నావు.. ఎవరికి చివరి ఎన్నికలో ఓటర్లు డిసైడ్ చేస్తారన్నారు. వాస్తవాన్ని ఒప్పుకోకుండా ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ఎన్నికలు జరిగాయని జగన్ ఏదేదో మాట్లాడుతున్నాడన్నారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్క ఏడాదిలోనే 90 శాతం పూర్తి చేశామన్నారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, సొసైటీ అధ్యక్షుడు చావా శ్రీనివాసరావు, సర్పంచ్ మేకల శ్రీనివాస్, ఎరుబండి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

కొవ్వూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అధిక కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తపై కేసున మోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్. సాంబమూర్తి తెలిపారు. పోలీసులు అందించిన వివరాలివి.. వాడపల్లికి చెందిన షణ్ముకమణికి తాడేపల్లిగూడెంకు చెందిన బండి షణ్ముక నాగేశ్వరరావుతో 2022లో వివాహం జరిగింది. వీరికి పిల్లలు లేరు. ఇటీవల భర్త, అత్త అధికకట్నం తీసుకురమ్మని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నట్టు షణ్ముకమణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ ఆర్. సాంబమూర్తి తెలిపారు.

కొవ్వూరు
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

వెండి ఉపకరణాలు అందజేత

దేవరపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథ ఆలయానికి దేవరపల్లికి చెందిన పెంజర్ల వెంకటేశ్వరరావు శ్యామలా దంపతులు రూ. 27 వేలు విలువ చేసే వెండి పళ్లెంలను ఆలయ కమిటీ సభ్యులు గుడ్ల వెంకటేశ్వరరావుకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక భక్తుల సహకారంతో ప్రతి గురువారం అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


బాధితులకు అందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పథకం పేదలకు ఒక వరమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 10 మందికి రూ. 9,57,558 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షులు చావా శ్రీనివాసరావు, సర్పంచ్ మేకల శ్రీనివాస్, ఎరుబండి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రీసర్వే దోహదం : తహశీల్దార్


తాడిపర్రులో మాట్లాడుతున్న తహశీల్దార్

ఉండ్రాజవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రైతుల భూసమస్యల పరిష్కారానికి రీసర్వే దోహదపడుతుందని తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం తాడిపర్రులో రీసర్వేపై జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో రీసర్వే వల్ల గ్రామ, భూముల సరిహద్దులు ఖచ్చితంగా నిర్ధారించుకోవచ్చన్నారు. గ్రామ సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు, మండల సర్వేయర్ జీ. శ్రీనివాసరావు, రీసర్వే డీటీ ఎం. హరిప్రసాద్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ నాణ్యమైన వైద్యసేవలు : మంత్రి


నిడదవోలులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం అందరికీ వైద్యసేవలు అందిస్తుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం నిడదవోలు పట్టణంలో రూ. 1.36 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ కేంద్రం ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆసుపత్రిని రూ. కోటి ఒక లక్ష నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ నిధులు, రూ. 35 లక్షలు మునిసిపల్ సాధారణ నిధులతో నిర్మించడం జరిగిందన్నారు. త్వరలో నిడదవోలు పట్టణ ప్రజలకు 100 పడకల ఆసుపత్రి, క్రీడా మైదానం, చిన కాశీ రేవు వద్ద బ్రిడ్జి నిర్మాణం ఉంటాయన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మ, వైద్యాధికారులు, సిబ్బంది మునిసిపల్ కౌన్సిలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ సభ్యుల ధర్నా


ఉండ్రాజవరంలో ధర్నా చేస్తున్న ఆటో యూనియన్ సభ్యులు

ఉండ్రాజవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15 తేదీ నుంచి మహిళలకు అందిస్తున్న ఉచిత బస్సు పథకం తమ జీవనానికి ఇబ్బందిగా మారుతుందని ఉండ్రాజవరంలో గురువారం ఉండ్రాజవరం ఫ్రెండ్స్ ఆటో యూనియన్ అసోసియేషన్ సభ్యులు స్థానిక హైస్కూల్ వద్ద ధర్నా నిర్వహించారు. అసలే అంతంత మాత్రపు కిరాయిలతో బతుకు నెట్టుకొస్తున్న మాకు ఉచిత బస్సు పథకం ఆందోళన కలిగిస్తుందని వారంతా వాపోయారు. మండలంలో సుమారు 3000 వరకు ఆటో నడుపుకుని జీవించే కుటుంబాలు ఉన్నాయని, దీంతో తమ కుటుంబాలు వీధినపడే అవకాశం ఉందన్నారు. ఆటో యూనియన్ ప్రెసిడెంట్ ఈదా శ్రీను, వైస్ ప్రెసిడెంట్ వీరమల్ల సతీష్, కార్యదర్శి పోతునూని శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ ఐశెట్టి వరప్రసాద్, కోశాధికారి పి.రాజేంద్ర ప్రసాద్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

డైట్ కళాశాల సందర్శన


మాట్లాడుతున్న ఎండీ షరీఫ్

నల్లజర్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, విలువలతో కూడిన విద్యను పిల్లలకు నేర్పించడానికి తగిన నైపుణ్యాలను ఛాత్రోపాధ్యాయులు తెలుసుకోవాలని మైనార్టీ శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎండీ షరీఫ్ అన్నారు. శుక్రవారం దూబచర్ల డైట్ కళాశాలను సందర్శించి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉర్దూ పాఠశాలలు పెంచి ప్రతి ముస్లిం విద్యార్థికి చిన్ననాటి నుంచే ఉర్దూ నేర్చుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ మీరాసాహెబ్, ప్రిన్సిపాల్ కమల కుమారి, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ పరిసరాల్లో స్వచ్ఛభారత్


స్వచ్ఛభారత్‌లో రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు

కొవ్వూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు రైల్వే స్టేషన్ పరిసరాలను రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు గురువారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. రైల్వే డీఆర్ఎం పిలుపు మేరకు కార్యక్రమాన్ని చేపట్టారు. కొవిడ్ కారణంగా కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో రైళ్ల హాల్ట్‌లను రద్దు చేయడంతో స్టేషన్ పరిసరాలలో ఎవరూ సంచరించకపోవడం వల్ల పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. దీంతో శ్రమదానం చేసి జేసీబీ సహాయంతో తొలగించారు. వీ.విల్సన్‌రాజు, వైకే శ్రీనివాస్, హజీబు జగన్నాథరావు, ఆలీషా, వెంకటేశ్వరరావు, పీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

పెద్దాపురాన్ని ప్రత్యేక పంచాయతీగా చేయండి


ఎమ్మెల్యేకి వినతిపత్రం అందిస్తున్న పెద్దాపురం గ్రామస్థులు

గోపాలపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వేలచింతల గూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని అనుసంధాన గ్రామమైన పెద్దాపురం గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని పెద్దాపురం టీడీపీ సీనియర్ నేత కొర్లపాటి అన్నవరం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు గురువారం వినతిపత్రం అందజేశారు. అన్నవరం మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఈ గ్రామప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామస్థుడు గన్నిన రామారాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాలు పంపిణీ

కొవ్వూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు విజయ విహార్ సెంటర్‌లో గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఆధ్వర్యంలో బీజేపీ నేతలు జాతీయ జెండాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో బోడపాటి ముత్యాలరావు, పిల్లలమర్రి మురళీకృష్ణ, రత్నసాయి, తదితరులు పాల్గొన్నారు.

పోతవరం సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తా

● నూతన చైర్మన్ ప్రభాకరరావు


ప్రభాకరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి, ఆప్కాబ్ చైర్మన్ గన్ని

నల్లజర్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పోతవరం సహకార సొసైటీని మరింత అభివృద్ధి పథంలో నడిపించి రైతులకు అండగా ఉంటానని నూతన చైర్మన్ పసుమర్తి ప్రభాకరావు అన్నారు. గురువారం సొసైటీ ఆవరణలో చైర్మన్‌గా ప్రభాకరావుతోపాటు సభ్యులుగా ఆలపాటి శేషా రత్నం, ఖండెల్లి గోతియ్య ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న డీసీసీబీ బ్యాంకులను దోచుకున్నారని ఆరోపించారు. సొసైటీలో బంగారంపై రుణాలను ఇకనుంచి తొమ్మిది శాతం వడ్డీకే ఇస్తామన్నారు. అలాగే సొసైటీ ద్వారా 1970 మంది రైతులు తమ వ్యవసాయ పెట్టుబడుల కోసం రుణాలు, ఎరువులు పురుగు మందులు పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో గోపాలపురం ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మారాజు, పోతవరం మాజీ సర్పంచ్ పసుమర్తి రతీష్, మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, అబ్బూరి నరేష్, కొండేపాటి శేషగిరి, కార్యదర్శి కాపూరి శ్రీనివాస్, అబ్బూరి పట్టియ్య, గన్నమనేని వెంకటేశ్వరరావు, పోతినీడుపాలెం సర్పంచ్ పిచ్చుకుల గణపతి, సురేంద్ర, బొర్రా పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

17న జిల్లా బాల్ 'బ్యాడ్మింటన్' ఎంపికలు

● అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ సతీష్‌కుమార్

నిడదవోలు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా సబ్ జూనియర్స్, సీనియర్స్ మహిళలు, పురుషుల బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక ఈనెల 17వ తేదీన తిమ్మరాజుపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతుందని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ సతీష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29వ తేదీ నుంచి 31 వరకు ప్రకాశం జిల్లా చేవూరులో నిర్వహించే రాష్ట్ర టోర్నమెంట్‌లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆరు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ కార్డుతో సెలక్షన్ పోటీలకు హాజరు కావాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 7013912527 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

అధిక వర్షాలకు ఆందోళన పడొద్దు

నిడదవోలు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న అధిక వర్షాలకు రైతాంగం ఆందోళన చెందొద్దని జిల్లా ఏరువాక కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త, కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. గురువారం రావిమెట్ల, శంకరాపురం, కంసాలిపాలెంలో పర్యటించి వివిధ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు వర్షాభావ పరిస్థితుల వల్ల వరి పంట ఎదుగుదల తగ్గి ... నల్లి పురుగు ఉధృతి పెరిగిందని ... ప్రస్తుత పరిస్థితుల్లో ఈ వానల వల్ల వరి చేలు పచ్చపడి నల్లి, ఆకుముడత పురుగులు నివారించబడతాయన్నారు. ఇలా కాకుండా ఒకవేళ అత్యధిక వర్షాలు కురిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలను ఆయన రైతులకు వివరించారు. ఆయన వెంట మండల వ్యవసాయశాఖాధికారి జీ.సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందాలి : సీఐ


బహుమతులు అందజేస్తున్న సీఐ విశ్వం

కొవ్వూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యో తి): ఎందరో మహానుభావుల ప్రాణత్యాగం వల్ల సాధించుకున్న స్వాతం త్ర్య ఫలాలు అందరికీ అందించాలని కొవ్వూరు పట్టణ సీఐ పీ.విశ్వం అన్నారు. స్వాతం త్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కొవ్వూరు హోలీ ఏంజిల్స్ పాఠశాలలో గురువారం రూమ్ డెకరేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులు జాతీయ జెండాలు, స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలతో అలంకరించిన డెకరేషన్‌లను ఆయన పరిశీలించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వలియవీడు నెల్సన్ ఆంటోని, డైరెక్టర్ జెస్సీ నెల్సన్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కొట్టి చంపుతానని బెదిరించిన వారిపై కేసు

కొవ్వూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కొట్టి చంపుతానని బెదిరించిన నలుగురిపై కేసులు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. పోలీసుల వివరాలివి.. పశివేదలకు మద్దాల రాజ్‌కుమార్‌ను ఈ నెల 12వ తేదీన సోదరుడు చిన్నరాజ్ ఫోన్ చేసి మా ఇంటివద్ద గొడవ జరుగుతుందని చెప్పగా.. మద్దాల రాజ్‌కుమార్, ధనలక్ష్మీ వచ్చారు. దీంతో బొమ్మిడి రాంబాబు, దాసరి వెంకట్రాయుడు, దాసరి రవి, దాసరి ప్రభాకరరావును తమను కింద పడవేసి కొట్టి చంపుతానని బెదిరించినట్టు రాజ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యంపై ...

కొవ్వూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. వివరాలివి .. పశివేదలకు చెందిన నల్లా శ్వేత తన కుమార్తెతో చాగల్లులోని అమ్మ గారింటికి వెళ్లింది. అక్కడ కొన్నిరోజులు ఉండి గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె తండ్రి మల్లిన భాస్కరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

త్రీమెన్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం


తీపర్రులో బాధ్యతలు స్వీకరించిన చైర్‌పర్సన్ సూర్యనారాయణ, సభ్యులు

పెరవలి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో త్రీమెన్ కమిటీ సభ్యులు గురువారం పదవీ ప్రమాణస్వీకారం చేశారు. ఇందులో కానూరు సహకార సంఘ చైర్‌పర్సన్‌గా వాకలపూడి వీర్రాజు, సభ్యులుగా కూనపరెడ్డి రత్న కుమారి, ఆరేపల్లి వీర వెంకట సత్యనారాయణ, తీపర్రు సహకార సంఘం చైర్‌పర్సన్‌గా కంటిపూడి సూర్యనారాయణ, సభ్యులుగా చిట్టూరి శ్రీనివాసరావు,సముద్రాల నరసింహమూర్తి, కాకరపర్రు సహకార సంఘ అధ్యక్షుడిగా పెన్మత్స మధు వర్మ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు అతికాల శ్రీను, అబ్బిశెట్టి సత్తిరాజు, బొడ్డు రామాంజనేయులు, జనసేన నాయకులు పిప్పర రవి, ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్, బీజేపీ నాయకులు సింహాద్రి సత్యనారాయణ, తదితరులు నూతన కమిటీలకు అభినందనలు తెలిపారు.

నీట మునిగిన పొలాలు


తీపర్రు వద్ద మునిగిపోయిన వరి పంట

పెరవలి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షంతో ఆయా గ్రామాల్లో పల్లపుప్రాంతాలు, పంట భూములు నీటి ముంపునకు గురయ్యాయి. బుధవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు కుండపోతగా కురిసిన వర్షంతో నీరు లాగక ఆయా గ్రామాల్లో రోడ్లన్నీ నీట మునిగాయి. అదేవిధంగా పంట భూముల్లో కూడా నీరు నిలిచిపోయింది. పల్లపు భూముల్లో నాట్లు వేసిన వరి చేలు మునిగిపోవడంతో పాటు కొత్తగా వేసినఅరటి పిలకలు కూడా నీట మునిగాయి. అన్నవరప్పాడు వెంకటేశ్వరస్వామి ఆలయంలో నీరు చేరింది. గురువారం సాయంత్రానికి కూడా నీరు ఎక్కడికక్కడ అలాగే నిలిచిపోయింది. ఈరోజు వర్షం కురవకపోవడంతో ప్రజానికం ఊపిరిపీల్చుకున్నారు.

ఉండ్రాజవరం: మండలంలో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షం వల్ల పలు గ్రామాల్లో వరిచేలు నీట మునిగాయి. మండలంలోని 15 గ్రామాల్లో 12వేల హెక్టార్లలో వరి పంటను వేశారు.

'కూటమి ప్రభుత్వానికే ప్రజలు పట్టం కట్టారు'


గోపాలపురంలో కేకును కోస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు రాము

గోపాలపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్టలో జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికే పట్టం కట్టారని టీడీపీ మండల అధ్యక్షుడు కొర్లపాటి రాము అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశ మందిరంలో విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేకును కోసి కార్యకర్తలకు పంచారు. అనంతరం మండల అధ్యక్షుడు కొర్లపాటి రాము మాట్లాడుతూ 30ఏళ్ల తరువాత పులివెందుల్లో ప్రజలు నిర్భయంగా ఓటు వేశారన్నారు. జగన్ అహంకారాన్ని ఓటు అనే ఆయుధంతో చిత్తు చేశారన్నారు. పులివెందుల పులిని అని చెప్పుకునే జగన్ పార్టీకి కనీసం డిపాజిట్లు కూడా రాలేదన్నారు. ఇది ప్రజా విజయంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వేముల నాగరాజు, మద్దిపాటి రాజేశ్, క్రాత గడ్డ సురేశ్, మద్దిపాటి రమేశ్, మేస్నీ సుధాకర్, ముగ్బుల్ బాష, యాళ్ల శ్రీను, వడ్లమూడి సూర్యనారాయణ, బొల్లారెడ్డి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంలో దోపిడీకి యత్నం


ఏటీఎంను పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

నిడదవోలు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తాడిమళ్లలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన ఏటీఎంను బుధవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు ఎటీఎమ్‌ను పగులు కొట్టి నగదు చోరీ చేసేందుకు ప్రయత్నించారు. అయితే ఏటీఎం పగులకొట్టడంలో విఫలం కావడంతో ఎటీఎమ్‌లో నగదు చోరీకి గురికాలేదు. దీనిపై జిల్లా అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్, ఎస్సై బాలాజీ సుందరరావు పరిశీలించారు. దీనిపై సమిశ్రగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.